RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 285 ఆదివారం 9 నవంబర్ 2025 పేజీలు : 4 వెల : రూ. 2.00

## చైనా సరికొత్త హైడ్రోజన్ బాంబు

న్యూఢిల్లీ : అణ్వస్త్రాల తరహాలో కాకుండా సాధారణ బాంబుల్లోనే అత్యధిక విధ్వంసం సృష్టించగల హైడ్రోజన్ బాంబును చైనా విజయవంతంగా పరీక్షించింది. ఏకంగా 1000 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతను వెలువరిస్తూ, కొన్ని సెకన్ల పాటు అగ్ని గోళం (ఫైర్ బాల్) నిలిచి ఉండే ఈ బాంబులతో.. తీవ్రమైన విధ్వంసం జరగడమే కాదు అల్యూమినియం అల్లాయ్ వంటి లోహాలు కరిగి, రక్షణ పరికరాలు, సామగ్రి దెబ్బతింటాయని చెబుతున్నారు. చైనా చేసిన ఈ ప్రయోగాత్మక పరీక్ష వివరాలతో సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పత్రిక తాజాగా కథనాన్ని ప్రచురించింది. చైనా షిప్ బిల్డింగ్ కార్పొరేషన్ పరిధిలోని '705 రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' ఈ హైడ్రోజన్ బాంబు పరీక్షను నిర్వహించినట్టు తెలిపింది.




## డిసెంబర్ 1 నుంచి 19 వరకు పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

న్యూఢిల్లీ, నవంబర్ 8: భారత పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1వ తేదీ నుంచి డిసెంబర్ 19వ తేదీ వరకు జరగనున్నాయి. మొత్తం 19 రోజులు సమావేశాలు కొనసాగుతాయి. ఈ తేదీలను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజూ ఇవాళ అధికారికంగా ప్రకటించారు.

ప్రభుత్వ సిఫారసు మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ సమావేశాలకు ఆమోదం తెలిపారని కేంద్రమంత్రి తెలిపారు. దీనికి సంబంధించి రిజిజూ తన X ఖాతాలో వెల్లడించారు. మన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సాగే నిర్మాణాత్మక, అర్థవంతమైన సమావేశాల కోసం తాను ఎదురుచూస్తున్నానని మంత్రి అన్నారు. ఈ సమావేశంలో కీలక బిల్లులు, ఆర్థికాంశాలపై చర్చలు, ప్రశ్నోత్తరాలు జరగనున్నాయి. ప్రతిపక్షాలు అనేక అంశాలపై కేంద్రానికి లోతైన ప్రశ్నలు సంధించే అవకాశం ఉంది. గత సమావేశాల్లో లాగానే ఈసారి కూడా సమావేశాల్లో రాజకీయ వేడి రగిలే అవకాశం ఉంది. ఈ శీతాకాల సమావేశాలు 18వ లోక్‌సభకు మరింత కీలకమని, ప్రజల సమస్యలు, దేశ అభివృద్ధి అంశాలపై చర్చ జరిగి, కొత్త చట్టాలు రూపొందే అవకాశం ఉందని రిజిజూ చెప్పారు.

పార్లమెంట్ సమావేశాలు సఫలం కావాలని, ప్రజలకు మేలు చేకూర్చాలని ఆశిస్తున్నామని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి తన సందేశంలో పేర్కొన్నారు.




## జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. ఇద్దరు ఉగ్రవాదుల హతం

జమ్మూకశ్మీర్‌లో భద్రతా దళాలు ఇద్దరు ఉగ్రవాదులను మట్టుపెట్టాయి. కుప్వారా జిల్లాలో శనివారం ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. జిల్లాలోని కీరన్ సెక్టర్‌లో ఉగ్రమూకలు చొరబాట్లకు ప్రయత్నిస్తున్నాయన్న నిఘా సమాచారంతో భద్రతా దళాలు శుక్రవారం రంగంలోకి దిగాయి. ఈ క్రమంలో శనివారం భద్రతాదళాలు తమ కంటపడగానే ఉగ్రమూకలు కాల్పులకు తెగబడ్డాయి. ప్రతిగా భద్రతాదళాలు కూడా కాల్పులు జరిపి ఉగ్రవాదులను మట్టుపెట్టాయి. ఈ విషయాన్ని ఎక్స్ వేదికగా వెల్లడించాయి. ప్రస్తుతం పరిసర ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నాయి. కాగా, నెల రోజుల క్రితం కూడా కుప్వారాలో ఉగ్రవాదులు భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నించారు. భద్రతా ద ళాలు దీటుగా స్పందించి ఇద్దరు ఉగ్రవాదులను మట్టుపెట్టాయి. అనుమానాస్పద కదలికలు కనిపించడంతో భద్రతా దళాలు అప్రమత్తమై వారిని అంతమొందించాయని అధికారులు తెలిపారు. భారత్, పాక్ మధ్య జమ్మూకశ్మీర్‌లో 740 కిలోమీటర్ల మేర నియంత్రణ రేఖ ఉన్న విషయం తెలిసిందే. బారాముల్లా, కుప్వారా, బందిపొరా జిల్లాలతో పాటు జమ్మూ జిల్లాలోని కొంత భాగంలో నియంత్రణ రేఖ ఉంది.




## వారణాసిలో మోదీ పర్యటన.. నాలుగు వందేభారత్ రైళ్లు ప్రారంభం

ఉత్తరప్రదేశ్: మరో నాలుగు వందేభారత్ రైళ్లను ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. వారణాసిలో ప్రధాని పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా బనారస్–ఖజురహో, లఖ్‌నవూ–సహరన్‌పుర్, ఫిరోజ్‌పుర్–ఢిల్లీ, ఎర్నాకులం–బెంగళూరు మార్గాల్లో వందే భారత్ రైళ్లను ఆయన ప్రారంభించారు. ఈ నాలుగింటితో కలిపి దేశంలో 160కిపైగా వందే భారత్ రైళ్లు సేవలందిస్తున్నట్లు ప్రధాని తెలిపారు. వందే భారత్, నమో భారత్ అనేవి భారత రైల్వేకి కొత్త తరమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

**రైళ్లు ప్రయాణించే వివరాలు..** బనారస్–ఖజురహో వందే భారత్ రైలు వారణాసి, ప్రయాగ్‌రాజ్, చిత్రకూట్ వంటి ఆధ్యాత్మిక కేంద్రాల మీదుగా ఖజురహోకు చేరుకుంటుంది. దీని ద్వారా దాదాపు 2 గంటల 30 నిమిషాల ప్రయాణ సమయం ఆదా కానుంది. లఖ్‌నవూ–సహరన్‌పుర్ వందే భారత్ రైలు సీతాపుర్, షాజహాన్‌పుర్, బరేలీ, మొరాదాబాద్, బిజ్నోర్ మీదుగా సహారన్‌పుర్ చేరుకుంటుంది. దాదాపు 7 గంటల 45 నిమిషాల్లో ప్రయాణం పూర్తి చేస్తుంది. దీంతో దాదాపు గంటపాటు సమయం ఆదా అవుతుంది. ఫిరోజ్‌పుర్–ఢిల్లీ వందేభారత్ రైలు కేవలం 6 గంటల 40 నిమిషాల్లో ఢిల్లీ చేరుకోనుంది. ఎర్నాకులం–బెంగళూరు వందేభారత్ రైలు 8 గంటల 40 నిమిషాల్లో ప్రయాణం పూర్తి చేస్తుంది. కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మధ్య సేవలందించనుంది. ఈ రైళ్లు ఆయా నగరాల మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గించడంతో పాటు పర్యాటకం, వాణిజ్యాన్ని పెంచనున్నాయి.


## జూబ్లీహిల్స్‌లో హీటెక్కిన ప్రచారం..

# గల్లీలు, బస్తీలపైనే దృష్టి..

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల ప్రజలు తీవ్ర ఉత్కంఠగా ఎదురుచూస్తున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నిక చివరి అంకానికి చేరింది. మరో రెండు రోజుల్లో ప్రచారం ముగియనున్న నేపథ్యంలో ప్రధాన పార్టీలు ముమ్మరంగా ప్రచారం చేస్తు న్నాయి. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అభ్యర్థులు, పార్టీల ముఖ్యనాయకులు, వారి అనుచరులు నియోజకవర్గంలోని ఓటర్లను కలుసుకుంటున్నారు. కాలనీలు, బస్తీల నుంచే మెజారిటీ ఓట్లు సాధించేలా ప్రచారం ముమ్మరం చేశారు.

**అధిక ఓట్లే టార్గెట్..** రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల నుంచి తరలి వచ్చిన ఆయా పార్టీల నాయకులకు జూబ్లీహిల్స్ సెగ్మెంట్లోని బస్తీలు, బూత్ల వారీగా కొద్ది రోజుల క్రితమే బాధ్యతలు అప్పగించారు. ప్రతీ 10వేల ఓట్లకు ఒక ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ నేతకు ఇన్చార్జిగా నియమించి ప్రచారం చేయిస్తున్నారు. వారంతా తమ తమ నియోజక వర్గంలోని మండలాల్లో ముఖ్యనాయకులుగా ఉన్నవారిని నగరానికి రప్పించి తిప్పుతున్నారు. ఇదే సమయంలో వారికి 100–1200 ఓట్లు బాధ్యతను కల్లా బెట్టారు. మెజార్టీ బార్గెటీసు కూడా విధించారు. ప్రత్యర్థి పార్టీ కంటే మునకే ఎక్కువ ఓట్లు రావాలని, మెజార్జి సాదించి సత్తాచాటాలని సూచించారు. దీంతో సదరు నాయకులు తమ సొంత మండలంలో పనిచేసిన మాదిరిగా జూబ్లీహిల్స్లోని బస్తీలు, గల్లీల్లో కాలుకు బలపం కట్టుకున్నట్లుగా తిరుగుతుండం ఆసక్తికరంగా మారింది.

**మరోవైపు సామాజిక వర్గాలతో ఆకర్షణ..** గల్లీలు, బస్తీలు, కాలనీల్లో ప్రచారం చేస్తున్న సందర్భంగా కొంతమంది నాయకులు ఓటర్ల సామాజిక వర్గాన్ని తెలుసుకుని ఆకట్టుకోవడం చర్చనీయాంశంగా మారింది. మైనార్టీ, యాదవ్, గౌడ, కమ్మ తదితర సామాజిక వర్గాలున్న కటుంబాల అడ్రస్‌ను ప్రచార సమయంలో స్థానిక కార్యకర్తల ద్వారా తెలుసుకుంటున్న నాయకులు.. తమది కూడా మీ సామాజిక వర్గమేనని




వారితో మాటలు కలిపి సరదాగా ముచ్చటిస్తున్నారు. తమ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇళ్లలో ఉండేవారితో పాటు దుకాణదారులు, నీ వ్యాపారులు, ఉద్యోగులందరిని కూడా ఇప్యాయంగా పలకరిస్తూ ఓటు బ్యాంకను పెంచుకుంటున్నారు జూబ్లీహిల్స్ ఎన్నిక అభ్యర్థుల కంటే ఇతార్జిలుగా భాధ్యతలు నిర్వర్తిస్తున్న ముఖ్య నాయకులకు ద్వితీయ శ్రేణి నాయకులకు సవాల్ గా మారిందని చెప్పవచ్చు. ఆయా ప్రాంతాల్లో ఓట్ల మెజ రిటీని బట్టి వారికి పార్టీలో ప్రాముఖ్యత దక్కనుందని భావిస్తున్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికను ఇటు అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు అటు ప్రధాన ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గెలుపు అవకాశాలను మెరుగు పరుచుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇందులో బాగంగా ప్రధాన పార్టీల నేతలు ప్రచారంలో కాలు దువ్వుతున్నారు. ఫలానా పార్టీతో ఏమి లాభం లేదని, మమ్మల్ని గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామని ఒకరు చెబుతుండగా, తాము నమ్మకానికి అమ్మలాంటి వారమని, ఎన్నికల్లో ఆశీర్వదించాలని మరో పార్టీ నేతలు పేర్కొం టున్నారు. పలు సందర్భాల్లో ఒకరిపై మరొకరు మాటల తూటాలు పేల్చుతుండడం ఆసక్తిక రంగా మారింది. ఇలా, ఉదయం నుంచి రాత్రి వరకు తమదైన శైలిలో ప్రచారం చేస్తూ మూడు ప్రధాన పార్టీల నాయకులు ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.




తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

రేవంత్‌రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ఇక, ఏపీ సీఎం చంద్రబాబు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా తెలంగాణ సీఎంకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

**రేవంత్‌రెడ్డి ప్రజాసేవలో కొనసాగాలి: చిరంజీవి** రేవంత్‌రెడ్డికి ప్రముఖ నటుడు చిరంజీవి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

ఆయనకు ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో కొనసాగాలని పేర్కొన్నారు.

**రేవంత్‌కు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు...** రేవంత్‌రెడ్డికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలకు మరింత సేవ చేసే శక్తిని, సంపూర్ణ ఆరోగ్యాన్ని ఆయనకు భగవంతుడు అందించాలని ఆకాంక్షించారు.

# ఆ ట్రెండ్ కంటిన్యూ అయితే...

# జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌కు...

# బిగ్ షాక్ తప్పదా...!?




హైదరాబాద్ లో ఎన్నికల వేడి పతాక స్థాయికి చేరుకుంది. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నికకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో– అన్ని రాజకీయ పార్టీలూ దీనిపై దృష్టి పెట్టాయి. ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోన్నాయి. ఈ నియోజకవర్గాన్ని హస్తగతం చేసుకోవడానికి అధికార కాంగ్రెస్, ఈ స్థానాన్ని నిలబెట్టుకోవడానికి భారత్ రాష్ట్ర సమితి హోరాహోరీగా తలపడుతున్నాయి. బీజేపీ సైతం అభ్యర్థిని నిలబెట్టబోతోంది. నవంబర్ 11వ తేదీన ఈ నియోజకవర్గానికి ఉపఎన్నిక జరుగనుంది. బీఆర్ఎస్ శాసన సభ్యుడు మాగంటి గోపీనాథ్ కన్నుమూత వల్ల ఈ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అవసరమైన విషయం తెలిసిందే. ఈ ఏడాది జూన్ లో ఆయన తుదిశ్వాస విడిచారు. ఈ ఉప ఎన్నికను దృష్టిలో ఉంచుకుని ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులపై కసరత్తు పూర్తి చేసింది. సోమవారం నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. తెలంగాణలో శాసనసభ్యుల మరణం తర్వాత జరిగే ఉప ఎన్నికల్లో సానుభూతి పెద్దగా వర్కవుట్ అయినట్లు కనిపించట్లేదు. సింపతీ ఓటుబ్యాంకు పని చేయట్లేదు. సానుభూతి ఓట్లు వారి కుటుంబ సభ్యులకు ఆశించిన స్థాయిలో లభించడం లేదు. 2014 తర్వాత జరిగిన అయిదు అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఇది స్పష్టంగా కనిపించింది కూడా. అయిదుసార్లు ఉప ఎన్నికలు జరిగితే నాలుగు సార్లు మరణించిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు ఓటమి పాలయ్యారు. నాలుగుసార్లు అధికార పార్టీనే గెలిచింది. 2016లో పాలేరు ఉప ఎన్నిక– సిట్టింగ ఎమ్మెల్యే రామిరెడ్డి వెంకట్ రెడ్డి కన్నుమూయడంతో ఆయన భార్య సుచరిత రెడ్డి పోటీ చేసి ఓడిపోయారు. బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన తుమ్మల నాగేశ్వరరావు ఇక్కడ 45,000లకు పైగా మెజారిటీతో విజయం సాధించారు. అదే ఏడాది నారాయణ్‌ఖేడ్ ఉప ఎన్నిక– కాంగ్రెస్ పార్టీకే చెందిన పీ కిష్టారెడ్డి మరణానంతరం జరిగిన ఉప ఎన్నికలో ఆయన కుమారుడు సంజీవరెడ్డి పోటీ చేసి ఓడిపోయారు. అధికార బీఆర్ఎస్ విజయం సాధించింది. ఆ పార్టీ తరఫున ఎం భూపాల్ రెడ్డి 53,000కు పైగా మెజారిటీ సాధించారు. 2020లో దుబ్బాక ఉప ఎన్నిక– బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే దివంగత సోలిపేట రామలింగారెడ్డి మరణానంతరం జరిగిన ఉప ఎన్నికలో ఆయన భార్య సోలిపేట సుజాతరెడ్డి పోటీ చేసి పరాజయాన్ని చవి చూశారు. అధికారంలో ఉన్నా కూడా బీఆర్ఎస్ ఓడిపోయింది. బీజేపీ తరఫున బరిలో దిగిన రఘునందన్ రావు విజయఢంకా మోగించారిక్కడ. 2021లో నాగార్జున సాగర్ ఉప ఎన్నిక– సిట్టింగ్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య కన్నుమూయడంతో జరిగిన ఈ ఉప ఎన్నికలో ఆయన కుమారుడు భగత్.. బీఆర్ఎస్ తరఫున పోటీ విజయం సాధించారు. కాంగ్రెస్ కు సీనియర్ నేత కుందూరు జానారెడ్డిని ఆయన ఓడించారిక్కడ. కుటుంబ సభ్యుడు గెలిచిన ఒకే ఒక్క నియోజకవర్గం ఇదొక్కటే. 2024లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నిక– బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే లాస్యా నందిత మరణానంతరం ఉప ఎన్నిక జరిగిందిక్కడ. ఆమె సోదరి జీ నివేదిక సాయన్న పోటీ చేసి ఓడిపోయారు. ఏకంగా మూడోస్థానానికి పడిపోయారు. అధికార కాంగ్రెస్ పార్టీ గెలిచింది. ఆ పార్టీ అభ్యర్థి గణేష్ ఘన విజయం సాధించారు. 2025లో జూబ్లీహిల్స్ పరిస్థితి ఏమిటనేది ఆసక్తికరంగా మారింది. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ భార్యను బీఆర్ఎస్ ఇక్కడ బరిలో దించింది. అదే ట్రెండ్ కొనసాగితే అధికార పార్టీ ఇక్కడ గెలవడం ఖాయం.

# సంపాదకీయం

## బిహార్ ఎన్నికల తర్వాత జరగబోయేది ఇదేనా?

బిహార్ ఎన్నికల తర్వాత కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకోనుందనే ప్రచారం జరుగుతోంది. గురువారం బిహార్ లో తొలి విడత ఎన్నికల పోలింగ్ జరిగింది. ఈ నెల 11న రెండో విడత పోలింగ్ నిర్వహించనున్నారు. 14న ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఈ ఎన్నికలు బిహార్ రాష్ట్రానికే పరిమితమైనప్పటికీ, ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత జాతీయ స్థాయిలో కీలక రాజకీయ నిర్ణయాలు ఉండొచ్చని అంటున్నారు. కాగా, బిహార్ లో గురువారం జరిగిన తొలివిడత పోలింగులో 64.66 శాతం ఓటింగు శాతం నమోదైంది. ఇది రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక పోలింగ్ శాతం కావడం విశేషం. బిహార్ ఎన్నికలు ముగిసిన తర్వాత 'వన్ నేషన్-వనే ఎలక్షన్'పై కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అంటున్నారు. బిహార్ లో ఎన్డీఏ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే కేంద్రం ముందుగా చెప్పినట్లు 2027లో జమిలి ఎన్నికల దిశగా అడుగులు వేయడం ఖాయమంటున్నారు. 2027 ఫిబ్రవరిలో ముందస్తు సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం అవడం ద్వారా జమిలి ఎన్నికలకు తెరతీయాలని కేంద్ర పెద్దలు యోచిస్తున్నట్లు చెబుతున్నారు. కేంద్రం అనుకున్నట్లు జమిలి ఎన్నికలు నిర్వహిస్తే 2027లో సుమారు ఆరు నెలల పాటు దేశంలో ఎన్నికల ప్రక్రియ కొనసాగే అవకాశం ఉంది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించే పరిస్థితి ఉందని అంటున్నారు. బిహార్ రిజల్ట్ వచ్చిన తర్వాత కేంద్రం జమిలి ఎన్నికల బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇందులో అసెంబ్లీ, లోక్ సభ, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు జరిపించే అంశాన్ని ఈ బిల్లు ద్వారా ఆమోదించాలని కేంద్రం యోచిస్తోందని అంటున్నారు. ఇక బిహార్ ఫలితంలో ఏం తేడా జరిగినా, జమిలి ఎన్నికల ప్రస్తావనకు ఫుల్ స్టాప్ పడే అవకాశం ఉందంటున్నారు. పదకొండేళ్లుగా దేశంలో అధికారం చెలాయిస్తున్న బీజేపీ, ఎన్డీఏ కూటమికి ఎదురుగాలి వీస్తే.. జమిలి ఎన్నికలు నిర్వహించే సాహసోపేతమైన నిర్ణయం తీసుకునే విషయంలో వెనక్కి తగ్గక తప్పదని అంటున్నారు. ప్రస్తుతం బీజేపీ దేశవ్యాప్తంగా మెజార్టీ రాష్ట్రాల్లో అధికారంలో ఉంది. ప్రజాభిప్రాయం అనుకూలంగా లేదని తేలితే, చేతిలో ఉన్న అధికారం పోగొట్టుకోవాల్సివస్తుందని, తద్వారా చేతులు కాల్చుకునే సాహసం చేయదని అంటున్నారు. ఒకవేళ బిహార్ లో ప్రధాని మోదీ నాయకత్వంలోని ఎన్డీఏకి ప్రజలు జైకొడితే ఊహించని సంచలన నిర్ణయానికి ప్రధాని పూనుకుంటారని విశ్లేషిస్తున్నారు.

## ఘనంగా ముగిసిన మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల క్రీడలు





శామీర్ పేట, నవంబర్ 8( గరుడ వార్త ) : మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల క్రీడోత్సవాలు శనివారం ముగిసాయి. శామీర్ పేట పరిధిలోని మహాత్మ జ్యోతిబాపూలే ఆవరణలో గురుకుల పాఠశాలలకు చెందిన హైదరాబాద్ జిల్లా స్థాయి క్రీడోత్సవాలు గత రెండు రోజులుగా హైదరాబాద్ జిల్లాలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల నుంచి దాదాపు 1200 మంది క్రీడాకారులు వివిధ విభాగాలలోని క్రీడల్లో పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా ఆర్ సి ఓ రాజేష్, హైదరాబాద్ జిల్లా డి సీ ఓ వెంకట్రావు లు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవికుమార్, ఏటీపీ లు శేఖర్, హెప్సిబా, ఆర్గనైజర్లు ఫిజికల్ డైరెక్టర్ వెంకటరెడ్డి, సాయికుమార్, సాయి బాబా, స్పోర్ట్స్ కమిటీ మెంబర్స్ నరేష్, టెండూల్కర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. వివిధ విభాగాల క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతి ప్రధానం చేశారు.

**గెలుపొందిన విజేతలు....** ఈ క్రీడల్లో కబడ్డీ విన్నర్ గా మల్కాజ్గిరి పాఠశాల, రన్నర్ మలక్ పేట పాఠశాల దక్కించుకుంది. అలాగే ఖో ఖో విన్నర్ గా మలక్ పేట పాఠశాల, రన్నర్ చార్మినార్ పాఠశాల కైవసం చేసుకున్నారు. వాలీబాల్లో విన్నర్ గా బండ్లగూడ పాఠశాల, రన్నర్ గా మల్కాజ్గిరి పాఠశాల క్రీడాకారులు గెలుపొందారు. టెన్నికైట్ విన్నర్గా చీకటిమా మిడి పాఠశాల, టెన్నికైట్ రన్నర్ గా సనత్ నగర్ పాఠశాల క్రీడాకారులు దక్కించుకున్నారు. చెస్ విన్నర్ గా చీకటి మామిడి పాఠశాల, రన్నర్ మల్కాజ్గిరి పాఠశాల కైవసం చేసుకున్నారు. మార్చి ఫస్ట్ ప్రథమ బహుమతి కూకట్ పల్లి స్కూల్ కైవసం చేసుకోగా, ద్వితీయ బహుమతి సనత్ నగర్ స్కూల్ దక్కించుకుంది. డిస్ప్లేప్రథమ బహుమతి శామీర్ పేట స్కూల్ దక్కించుకోగా, ద్వితీయ స్థానంలో ముషీరాబాద్ స్కూల్ నిలిచింది. ఓవరాల్ ఛాంపియన్ షిప్ ను మలక్ పేట క్యాంపస్ కైవసం చేసుకుంది. గెలిచిన క్రీడాకారులకు పాఠశాల ప్రిన్సిపాల్ అభినందనలు తెలియజేశారు.

## ఘనంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు





శామీర్ పేట, నవంబర్ 8 ( గరుడ వార్త) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. శనివారం మూడు చింతలపల్లి వీరారెడ్డి చౌరస్తాలో ఏ బ్లాక్ దక్షుడు వేణుగోపాల్ రెడ్డి, మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి బాణాసంచా పేల్చి వేడుకలను నిర్వహించారు. అనంతరం జగ్గంగూడ పరిధిలోని ది హెూమ్ ఫర్ డిజెబుల్ ఆశ్రమంలో దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందన్నారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంపీగా ఇక్కడినుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించారని చెప్పారు. మూడు చింతలపల్లి తో పాటు నియోజకవర్గంలోని మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకొని తనకు బహుమతిగా ఇస్తామని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగ లక్ష్మారెడ్డి, బండి జగన్నాథం, రాజేంద్రప్రసాద్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ గౌడ్, వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

## మున్సిపల్ కార్మికులకు నూతన దుస్తుల అందజేసిన మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్





శామీర్ పేట, నవంబర్ 8 ( గరుడ వార్త ) : ఎంపీపీల ఫోరం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికు లకు నూతన దుస్తులను పంపిణీ చేశారు. శామీర్ పేట మండలం తూంకుంట మున్సిపల్ కార్మికులకు శనివారం చంద్రశేఖర్ యాదవ్ నూతన దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ కార్మికుల సేవలు ఎనలేనివని, ప్రతినిత్యం మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో శుభ్రం చేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారని కొని యాడారు. వారు వార్డుల్లో శుభ్రం చేయకుంటే వార్డులన్నీ దుర్గంధంతో వెదజల్లుతాయన్నారు. వారి సేవలను గుర్తిస్తూ వారికి నూతన దుస్తులు అందజేస్తున్నట్లు చెప్పారు. దాదాపు 80 మంది కార్మికులతో పాటు మున్సిపల్ కార్యాలయం సిబ్బందికి నూతన దుస్తులు అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వినోద్ జైన్, టి ఆర్ రవీందర్ గౌడ్, పరమేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్ రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ విష్ణు, శివాలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ



**శామీర్ పేట, నవంబర్ 8 ( గరుడ వార్త) : శ్రీ విష్ణు, శివాలయ ప్రాంగణంలో ఘనంగా అన్న ప్రసాద వితరణ చేపట్టారు. శనివారం మూడు చింతలపల్లి మున్సిపల్ పరిధిలోని ఉద్దమర్రి అక్కన్న మాదన్నల నాటి శ్రీ విష్ణు, శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు, రహదారి నుంచి వెళ్లే భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు**

## వడ్డీ.. మెట్రో నడ్డి విరుస్తోంది!

హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో ప్రైవేటు యాజమాన్యం నుంచి ప్రభుత్వానికి మారాలంటే ఈక్విటీని ఎల్ అండ్ టీకి చెల్లించడం తోపాటు ఆ సంస్థ చేసిన రుణాల మొత్తాన్ని సర్కారుకు బదలాయించుకోవాలి. ఈ రుణాలపై చెల్లిస్తున్న వడ్డీలు ప్రస్తుతం అధికంగా ఉన్నాయి. ఇదే మెట్రో నడ్డివిరుస్తోంది. దీంతో తక్కువ వడ్డీకి అప్పులు ఇచ్చే అంతర్జాతీయ సంస్థల కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్వేషిస్తోంది. ఇందుకోసం ఏజెన్సీలతో చర్చిస్తోంది. రుణాల సమీకరణలో విస్తృత అనుభవం ఉన్న బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్(బీసీజీ) వంటి వాటితో కసరత్తు చేస్తోంది. **రూ.13వేల కోట్లు..** మెట్రోను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో నిర్మించిన సంగతి తెలిసిందే. ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ కొంత ఈక్విటీగా.. మిగిలిన మొత్తాన్ని బ్యాంకుల నుంచి రుణంగా తీసుకుంది. ఈక్విటీ రూ.2000 కోట్లను



చెల్లించేందుకు సర్కారు ముందుకొచ్చింది. అప్పులు రూ.13 వేల కోట్లు ఉన్నాయి. వీటిపై 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.940 కోట్లను వడ్డీ రూపంలో చెల్లించింది.

వార్షికంగా సగటున రూ. వెయ్యి కోట్లు... ప్రభుత్వం వార్షికంగా సగటున రూ.1000 కోట్లు మొదటి దశకు చెల్లించడమంటే ఆర్థికంగా భారం అవుతుంది. ఈ భారం సగానికి తగ్గాలంటే తక్కువ వడ్డీకే రుణాల బదలాయింపు జరగాలి. కొత్త ప్రాజెక్టలకు జైకా, ఏడీబీ వంటి సంస్థలు రెండు మూడు శాతానికే రుణాలు మంజూరు చేస్తుంటాయి. ఇప్పటికే పూర్తైన ప్రాజెక్టలకు ఇస్తాయా అనే సందేహాలు ఉన్నాయి. గతంలో ఇచ్చారని అధికారులు అంటున్నారు.

## విద్యార్థి చూపు.. నగరం వైపు

బొంరాస్‌పేట: డిగ్రీ చదువులపై విద్యార్థులకు ఆసక్తి తగ్గుతోంది. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన తరవాత డిగ్రీ కళాశాలల్లో చేరడానికి ముందుకు రావడం లేదు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఏటా దోస్త్(డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) ద్వారా ప్రవేశాలు కల్పిస్తున్నారు. స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ ముగిసినా చేరికలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. హైదరాబాద్ నగరంలోని కళాశాలలతో పోల్చుకుంటే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వాటిలో విద్యార్థులు చాలా తక్కువగా చేరుతున్నారు. దీంతో భారీగా సీట్లు మిగిలిపోయాయి.

**నాలుగు నియోజకవర్గ కేంద్రాల్లో..**

జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ పట్టణాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలున్నాయి. వాటిలో బీఏ, బీకాం కంప్యూటర్స్,



బీఎస్సీ, ఫిజికల్, లైఫ్ సైన్సెస్ వంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఆయా కోర్సుల్లో మొత్తం 1,660 సీట్లు ఉన్నాయి. వాటిని భర్తీ చేయడానికి దోస్త్ ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. అర్హతలనుబట్టి మూడు విడతల్లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఒకసారి స్పాట్ అడ్మిషన్లను నిర్వహించగా.. 658 మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో చేరారు. ఇంకా 1,002 సీట్లు ఖాళీగా ఉన్నాయి. పరిగిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం లేదు. జూనియర్ కాలేజీలోని మూడు గదుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ వసతి ప్రధాన సమస్యగా మారింది. ఇంటర్ పూర్తయిన తరవాత ఆర్థిక స్తోమత లేని తల్లిదండ్రులు పిల్లలను ఉపాధి కోసం వివిధ పనులు చేయడానికి పంపుతున్నారు. లేదంటే పార్ట్‌టైంగా ఏదో ఒక పని చేసి చదువుకునేలా ప్రోత్సహిస్తున్నారు. దీంతో నగరంలోని కాలేజీల్లో చేరుతున్నారు. అలాగే ఆర్థికంగా ఉన్నవారు ఇంజినీరింగ్, వైద్యవిద్య వైపు మళ్లుతున్నారు. దీంతో సీట్లు మిగులుతున్నాయని అధ్యాపకులు అభిప్రాయపడుతున్నారు.

## అక్రమాలకు అడ్డుకట్ట పడేనా?

సంగారెడ్డి, వానాకాలం సీజన్ ధాన్యం సేకరణకు పౌరసరఫరాల శాఖ సన్నాహాలు మొదలుపెట్టింది. గత కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో భారీగా అక్రమాలు జరిగాయి. మిల్లర్లు తరుగు పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారన్నే విమర్శలున్నాయి. అధికారులు, మిల్లర్లు కుమ్మక్కయి అవినీతికి తెరలేపారనే ఆరోపణల నేపథ్యంలో పౌరసరఫరాల శాఖకు చెందిన విజిలెన్స్ విచారణ చేపడుతోంది. ప్రస్తుత సీజన్‌లోనైనా అక్రమాలకు అడ్డుకట్ట వేసేలా ఉమ్మడి జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి.

సొమ్ము చేసుకుంటున్నారు!

మెదక్ జిల్లాలో రూ.39.69 కోట్ల విలువైన ధాన్యం సేకరణలో గోల్‌మాల్ జరిగినట్లు విజిలెన్స్ అధికారులు నిర్ధారణకు వచ్చారు. 24 మిల్లుల్లో ధాన్యం దించుకోకుండానే నకిలీ ట్రక్‌షీట్లు సృష్టించారనే విమర్శలపై విచారణ నిర్వహిస్తున్నారు. 2022-23 యాసంగి ధాన్యాన్ని 72 రైసుమిల్లులు టెండర్ దక్కించుకున్నాయి. రూ.175 కోట్ల విలువైన ధాన్యం ఇవ్వకుండా మొండికేస్తున్నాయి. మిల్లర్లు సొమ్ముచేసుకున్నట్లు సమాచారం.

సిద్దిపేట జిల్లాలో కొందరు వ్యాపారులు సీఎంఆర్ బియ్యం ఇవ్వకుండా గడువులు కోరుతున్నారు. వారు వేరే వ్యాపారులకు లీజుకిచ్చి లావాదేవీలు నిర్వహిస్తున్నారనే విమర్శలున్నాయి.

ధాన్యం బకాయిల్లేని మిల్లులకే సీఎమ్మార్ కేటాయింపులుంటాయని వికారాబాద్ జిల్లా అధికారులు తెలిపారు. గతేడాది 26 మంది మిల్లర్లు సీఎమ్మార్ కింద ధాన్యం తీసుకున్నారు. వారి నుంచి 75 శాతమే సేకరించారు.

**ఆదేశాలు పక్కాగా అమలైతేనే..**

గత వానాకాలం నుంచే మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారంటీలు తీసుకుంటోంది. కొందరు గ్యారంటీలు ఇవ్వకుండానే ధాన్యం తీసేసుకుంటున్నారు.గత వారం పౌరసరఫరాల శాఖ జారీ చేసిన నిబంధనల ప్రకారం బ్యాంక్ గ్యారంటీ సమర్పించిన మిల్లర్లకే ధాన్యం కేటాయింపులు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కాంటా తదనంతరం ధాన్యం తరలింపుతో భద్రపరిచే భాధ్యత పూర్తిగా కొనుగోలు కేంద్రాలదేనని మార్గదర్శకాలలో స్పష్టంగా ఉంది.

ఎఫ్ఎక్యూ (నిర్దేశిత నాణ్యతా ప్రమాణాల) నిబంధనలకు అనుగుణంగా తరుగు తీసుకుంటే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటారు. ట్రక్‌షీట్‌లో మార్పులు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## సీఎంఆర్ సేకరణలో పెద్దపల్లి టాప్

పెద్దపల్లి : అధికారుల సమష్టి శ్రమతో మిల్లర్ల నుంచి తీసుకోవాల్సిన బియ్యం(సీఎంఆర్) సేకరణ ప్రగతికి సంబంధించి పెద్దపల్లి జిల్లా అగ్రపథంలో కొనసాగుతోంది. కలెక్టర్ శ్రీహర్ష పర్యవేక్షణలో నిరంతరం సమీక్షించడం, లోపాలను సరిదిద్దడంతో 2024–25 వానాకాలం సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలో ముందు వరుసలో నిచిలింది. బియ్యం మరపట్టడంలో మానవ వనరులు సమకూర్చడం, మిల్లర్లు సహకరించడంతో లక్ష్యం చేరువైంది. శతశాతానికి అడుగు దూరంలో ఉంది. ఈనెల 11 లోపు పూర్తిస్థాయిలో లక్ష్యం చేరుకునేందుకు యంత్రాంగం సిద్ధమైంది.

**సాధ్యమైంది ఇలా..**

సీజన్ ఆరంభంలో బకాయిలు లేని మిల్లులకు లక్ష్యాల కేటాయింపు



గతంలో పెండింగ్ ఉన్న మిల్లర్లకు నోటీసుల జారీ

క్రమం తప్పకుండా మిల్లర్లతో సమీక్ష, మిల్లుల వారీగా ప్రగతిపై ఆరా

అదనపు హమాలీలు, యంత్రాలు సమకూర్చుకోవడం

అడుగు దూరంలో మిగతా జిల్లాలు

ఉమ్మడి జిల్లాలో 360 మిల్లులున్నాయి. నాలుగు జిల్లాల్లో వానాకాలంలో 10,77,901 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. దీనిలో 8,68,648 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా.. 6,18,776 మెట్రిక్ టన్నులు ఇచ్చారు. ఈ జాబితాలో రాజన్న సిరిసిల్ల వెనుకబడింది. వానాకాలం బియ్యం సేకరణ లక్ష్యాలు పూర్తిచేసిన మిల్లర్లు యాసంగి ధాన్యంపై దృష్టి సారించారు. గతంలో పోల్చితే పెద్దపల్లిలో మిల్లర్ల ఆగడాలకు అధికారులు కళ్లెం వేస్తున్నారు. కొద్దిగా బకాయిలున్నా ధాన్యం కేటాయించడంలేదు.

## కన్నేసి.. అమ్మేసి!

పెద్దపల్లి: పేదలకు దక్కాల్సిన ఇళ్ల స్థలాలపై కొందరు అక్రమార్కులు కన్నేశారు. వారికున్న పలుకుబడితో మూడో కంటికి తెలియకుండా పదుల సంఖ్యలో ప్రభుత్వ ప్లాట్లను అమ్ముకున్నారు. కొందరు నాయకుల కనుసన్నల్లో కొనసాగుతున్న ఈ అక్రమదందాపై వచ్చిన ఫిర్యాదులపై ఎమ్మెల్యే స్పందించగా ఈ వ్యవహారం బట్టబయలైంది. 2009లో పేదల ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం 6 ఎకరాల ప్రైవేటు భూమిని కొనుగోలు చేసింది. అప్పట్లో జరిగిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పలుమార్లు వాయిదా పడటం, ప్రభుత్వాలు మారిపోవడంతో కొందరికి మాత్రమే ప్రభుత్వం 100 గజాల చొప్పున ఇళ్ల స్థలాలను కేటాయించింది. అనంతరం 1.5 ఎకరాల్లో రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడంతో మిగతా స్థలం ఖాళీగా మారింది. ఈ క్రమంలో ఖాళీగా ఉన్న స్థలంపై కొందరు రాజకీయ నాయకులు కన్నేశారు. పేదల బలహీనతను సొమ్ము చేసుకునేందుకు ప్రభుత్వ స్థలాలు కేటాయిస్తున్నామనే భ్రమ కల్పించారు. ఇందుకు ప్లాట్లు కావాల్సిన వారి నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారు. గడిచిన మూడేళ్లలో 40కిపైగా ఇళ్ల స్థలాలకు అమ్ముకున్నారు. వీటిలో కొందరు



ఇళ్లను నిర్మించుకోవడం, వారికి ఇంటి నంబర్లను మున్సిపల్ అధికారులు కేటాయించకపోవడంతో ఈ విషయం ఉన్నతాధికారుల వద్దకు చేరింది.

**బాధితుల్లో ఆందోళన**

చందపల్లి సమీపంలో జరిగిన అక్రమ నిర్మాణాలను మున్సిపల్, రెవెన్యూ అధికారులు కూల్చివేయడంతో బాధితులు ఆందోళనకు గురవుతున్నారు. డబ్బులు తీసుకున్న నాయకులు ముఖం చాటేయడం, అధికారులు కూల్చివేతలు చేపట్టడంతో కొనుగోలుదారులు అయోమయానికి గురవుతున్నారు. స్థానికులకు ఇళ్ల స్థలాలిస్తే అక్రమాలు వెలుగు చూస్తాయని భావించిన సదరు నాయకులు ఇతర గ్రామాలకు చెందిన వారితోపాటు సుల్తానాబాద్‌కు చెందిన వారికి విక్రయించారనే ప్రచారం జరుగుతోంది. కానీ బాధితులెవరూ ఇప్పటి వరకు అధికారులకు ఫిర్యాదు చేయలేదు. అధికారి ఏమన్నారంటే.. వీటిపై ఆర్డీవో గంగయ్యను వివరణ కోరగా అక్రమంగా నిర్మాణాలు చేసిన వారి ఇళ్లను కూల్చివేశామని, అక్కడ ఎంత మంది ఆక్రమించారనే అంశంపై విచారణ చేపడుతున్నట్లు చెప్పారు.

## చకచకా.. విపణి పనులు

ఖమ్మం : ఖమ్మం వ్యవసాయ మార్కెట్ రూపురేఖలు క్రమంగా మారుతున్నాయి. రూ.155.30 కోట్లతో మోడల్ మార్కెట్ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. 'నెమ్మదిగా ఆధునికీకరణ పనులు' శీర్షికన అక్టోబర్ 10నలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై అధికారులు స్పందించారు. అదేనెల 23న మార్కెటింగ్‌శాఖ సంచాలకురాలు సుమారు గంటన్నర సేపు మార్కెట్‌లో పర్యటించి పనులను పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. మరోవైపు వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక దృష్టి సారించారు. సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, గుత్తేదారులకు ఎప్పటికప్పుడు సూచనలిస్తున్నారు. గతంలో 80వేల మిరప బస్తాల సామర్థ్యం ఉంటే భవిష్యత్తులో 2లక్షల బస్తాలను విపణిలో విక్రయించే అవకాశం రానుంది.

**సంక్రాంతి నాటికి అందుబాటులోకి..!**

తాజాగా ఐదో షెడ్‌కు సంబంధించి ప్లెయిన్ సిమెంట్ కాంక్రీట్ (పీసీసీ), పైకప్పు పనులు పూర్తయ్యాయి. నాలుగో షెడ్‌లో పీసీసీ పనులు ముగిశాయి. ఇనుప స్తంభాలు నిలబెట్టారు. మూడో షెడ్‌లో గ్రావెల్ పూర్తిచేసి ఇనుప స్తంభాలు ఏర్పాటుచేశారు. మొత్తం ఎనిమిది షెడ్లకు సంబంధించిన పనులు పుంజుకున్నాయి. ఇతర అభివృద్ధి పనులూ చురుగ్గా జరుగుతున్నాయి. అన్నింటినీ పూర్తిచేసి సంక్రాంతి నాటికి మార్కెట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. రెండంతస్తుల భవనంతో పాటు రైతు విశ్రాంతి భవనం, దడవాయి మీటింగ్ హాల్, ట్రేడర్స్ అండ్ కమీషన్ ఏజెంట్స్ హాల్‌నూ నిర్మించనున్నారు. మూడంతస్తులతో పరిపాలన భవనం, మూడు శౌచాలయ బ్లాకులు, నాలుగు ఆర్ఓ వాటర్ ప్లాంట్లు, రైతుల భోజనశాల నిర్మించాలని, షెడ్లపై సోలార్ ప్యానెళు అమర్చాలని ప్రణాళిక రూపొందించారు.

## కొండగట్టు భక్తులపై పూజల భారం



మల్యాల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో పూజల టిక్కెట్ల ధరలు పెంచనున్నట్లు ఆలయ ఈవో శ్రీకాంతరావు వెల్లడించారు. ఏటా దాదాపు రూ.25 కోట్ల ఆదాయం సమకూరే అంజన్న ఆలయానికి.. నిత్యం 20 వేలకుపైగా భక్తులు వస్తారు. వసతులు అంతంతమాత్రంగానే ఉన్నప్పటికి ఆలయంలో కొత్తగా కొన్ని పూజా కార్యక్రమాలు ప్రవేశపెట్టడంతోపాటు వాటి టిక్కెట్ ధరలు గణనీయంగా పెంచడం గమనార్హం. ఆర్జిత సేవల టిక్కెట్ల ధరలను పెంచేందుకు దేవాదాయశాఖ కమిషనరు ఆమోదం తెలిపినట్లు ఈవో తెలిపారు. ఈనెల 15 నుంచి పెంచిన టిక్కెట్ల ధరలు అమలులోకి వస్తాయని, ఆలోగా భక్తుల స్పందనను గమనించడానికి శని, మంగళవారాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు వివరించారు.

**కొత్తగా ప్రవేశపెట్టే పూజా కార్యక్రమాలు, ధరలు**

సుప్రభాత సేవ(ఇద్దరికి) రూ.వెయ్యి.

వడమాల భోగం రూ.1116.

మన్యసూక్త హోమం రూ.2 వేలు.

శనిగ్రహ పీడ నివారణ పూజ(అమావాస్య రోజు మాత్రమే) రూ.వెయ్యి

అధిక రేట్లతో మళ్లీ అమలయ్యేవి

చందనం పూజ(శని, మంగళవారాల్లో మాత్రమే) ప్రస్తుతం రూ.800, పెంచబోయేది రూ.1500

అంతరాలయ దర్శనం ప్రస్తుతం రూ.400, పెరిగేది రూ.800

శాశ్వత అభిషేకం పాత రేటు రూ.1116. అమలు చేసేది రూ.10,116. పదేళ్ల వరకూ భక్తుల పేరిట అభిషేకం చేస్తారు.

ప్రస్తుత సేవలు

అభిషేకం రూ.500

సత్యనారాయణ వ్రతం రూ.400

కుంకుమ పూజ రూ.200

శ్రీవేంకటేశ్వరస్వామి సేవ రూ.300

శీఘ్రదర్శనం రూ.100

అతి శీఘ్రదర్శనం రూ.300

11 రోజుల హారతి రూ.150

21రోజుల హారతి రూ.250

41రోజుల హారతి రూ.400

కేశఖండనం రూ.50

**వసతులు పెంచుతాం: శ్రీకాంతరావు, ఆలయ ఈవో కొండగట్టు**

కొత్త పూజా కార్యక్రమాలను అమలు చేయడం ద్వారా ఆలయానికి ఏటా రూ.కోటి వరకు ఆదాయం సమకూరుతుందని భావిస్తున్నాం. కొండపైన సెల్‌టవర్ నిర్మాణానికి ఇండస్ సంస్థను కోరాం. ఆలయ పరిసరాల్లోని దుకాణాలను పార్కింగు ప్రాంతంలోకి మార్చి, భక్తులకు అదనపు టిక్కెట్ కౌంటర్లు ఏర్పాటు చేస్తాం. మునుల గుహ వద్ద ధ్యాన మందిరం నిర్మించడానికి నిర్ణయించాం.

## చేప పిల్ల.. చెరువు చేరేదెలా?



కరీంనగర్ : మత్స్యకారుల ఉపాధిపై నీలి నీడలు కమ్ముకున్నాయి. చేప పిల్లల ఉచిత సరఫరాలో స్పష్టత కరవైంది. గుత్తేదారులు ముందుకురాక కరీంనగర్, పెద్దపల్లిలో చేప పిల్లల పంపిణీ ప్రశ్నార్థకంగా మారింది. ప్రత్యామ్నాయంగా ఇతర జిల్లాల్లోని గుత్తేదారులకు బాధ్యతలు కట్టబెట్టాలని అధికారులు ప్రయత్నాలు చేస్తున్నా కుదరడం లేదు.

**స్పష్టత కరవు**

ఉమ్మడి జిల్లాల్లో రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో చేప పిల్లల పంపిణీకి గుత్తేదారులు పాల్గొనడంతో టెండర్లు ఖరారయ్యాయి. మిగిలిన కరీంనగర్, పెద్దపల్లిలో ఒకట్రెండు సార్లు టెండర్లు పిలిచినా గుత్తేదారులు ఆసక్తి చూపలేదు. దీంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. గతేడాది సరఫరా చేయకపోవడంతో మత్స్యకారులు నష్టపోయి ఆవేదన చెందారు. చివరి వరకు వేచి చూసినా లాభం లేదని కొందరు సొంతంగా కొనుగోలు చేసుకుని చెరువుల్లో వదిలారు. ఈ ఏడాది స్పష్టత లేకపోవడంతో ఇప్పటికే కొందరు సొంత డబ్బులతో జలాశయాల్లో చేప పిల్లలను వదిలేస్తున్నారు.

**రెండు జిల్లాల్లో వివరాలు**

సంఘాలు : 345

సభ్యులు : 27,417

చేప పిల్లలు వదిలే వనరులు : 2124

ఈ ఏడాది లక్ష్యం : 3.89 కోట్లు

ఎదుగుదలపై ప్రభావం

ప్రతీ సీజన్‌లో చేప పిల్లల పరిమాణం, మోతాదు విషయంలో కచ్చితమైన ప్రామాణికత పాటించడం లేదు.

చిన్న సైజు(35–40 మి.మీ) పిల్లలను పంపిణీ చేస్తుండటంతో మృతి చెందుతున్నాయి. బతికిన పిల్లలు పెద్ద సైజు(80 నుంచి 100 మి.మీ) వరకు రావడం లేదు. కల్తీ విత్తన పిల్లలతో రవ్వ, బొచ్చ రకాల ఉత్పత్తి పెరగకపోవడంతో నష్టం వస్తోంది.

సెప్టెంబరు చివరిలోపు పంపిణీ చేస్తే ఎదుగుదల వచ్చేవి. నవంబరులో వీటి ఊసే లేకపోవడంతో ఎదుగుదలపై ప్రభావం పడుతుందని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

ఉచిత పిల్లలకు బదులు నగదు బదిలీ చేయాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. నగదు చెల్లిస్తే నాణ్యమైన పిల్లలు తామే తెచ్చుకుంటామంటున్నారు.

## అర్హతకు మించి వైద్యం



కరీంనగర్: తరచూ ఉమ్మడి జిల్లాలో అర్హతకు మించి కొందరు ఆర్ఎంపీలు చేస్తున్న వైద్యం ప్రాణాలు తీస్తోంది. తాజాగా తిమ్మాపూర్ మండలంలో అర్హత లేకుండానే ఆర్ఎంపీగా రోగులకు వైద్యాన్ని అందిస్తున్న వ్యక్తిపై మెడికల్ కౌన్సిల్ సభ్యులు స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. పల్లెల్లో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రాథమిక చేయాల్సిన ఆర్ఎంపీల్లో కొందరు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తుడటం గమనార్హం.

ఈ ఏడాది జూన్ 27న చందుర్తి మండలంలో ఆర్ఎంపీ వైద్యం వికటించి 8 ఏళ్ల చిన్నారి చనిపోయింది. తేలు కుట్టిందని పాపని ఆయన వద్దకు తీసుకెళ్తే రెండు ఇంజక్షన్లు ఇచ్చి నయమవుతుందని ఇంటికి పంపించాడు. ఇంటికి వెళ్లాక పాప అపస్మారక స్థితికి చేరడంతో పలు ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్లి పరిశీలించినా చిన్నారి బతకలేదు.

2023 నవంబరు 14న మానకొండూర్ మండలంలోని ఓ ఆర్ఎంపీ వైద్యంతో రైతు మృతి చెందాడు. పొలం పనులకు వెళ్లి వచ్చిన తరువాత ఒంట్లో బాగాలేకపోవడంతో ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు వెళ్లగా ఆయన ఒక ఇంజక్షన్ ఇవ్వడంతోపాటు సెలైన్ పెట్టాడు. తరువాత కొద్దిసేపటికే రోగి శరీరమంతా రంగుమారడంతో కరీంనగర్‌కు పంపే లోపు రైతు ప్రాణాలొదిలాడు.

**నిబంధనలకు విరుద్ధంగా..**

నాలుగు జిల్లాల పరిధిలో ఎవరు అర్హులు? ఎవరు అనర్హులనే విషయంలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉండటం లేదు. దీంతో కొందరు ఇష్టారాజ్యంగా వైద్యసేవలు అందిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌లోనే ఔషధాలను విక్రయిస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 500ల మందికిపైగా ఆర్ఎంపీలున్నట్లు అంచనా. వీరిలో కొందరికి ధ్రువపత్రాలు లేకున్నా సేవలందిస్తున్నారు. వీరి వద్దకు వచ్చే వారికి తమ పరిధికి మించి వైద్యం అందిస్తున్నారని ఆరోపణలున్నా పర్యవేక్షణ లేకపోవడంతో చర్యలు లేకుండాపోతున్నాయి. అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ అర్హతకు మించి వైద్యం చేసిన వారిపై చర్యలు తీసుకుంటే ప్రజలకు మేలు జరుగుతుంది.

**నిబంధనలిలా..**

ఆర్ఎంపీ (రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్) కోర్సు చేసి అర్హత పొందాలి.

ఒకేషనల్ కౌన్సిల్ ఆఫ్ ట్రైనింగ్ అకాడమీ ధ్రువపత్రం ఉండాలి.

ప్రాథమిక చికిత్సను మాత్రమే అందించాలి.

కఠిన చర్యలు తీసుకుంటాం: వాణిశ్రీ, జిల్లా వైద్యాధికారి

జిల్లాలో ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స చేసుకోవాలని ఆదేశించాం. గతంలో సమావేశం నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా చేయరాదని సూచించాం. ఫిర్యాదులు వచ్చిన వెంటనే విచారణ చేసి కఠిన చర్యలు తీసుకుంటాం.

## డబ్బుల్ కష్టాలు!

ఖమ్మం: స్లాబ్ దశకు చేరిన ఈ ఇల్లు ఖమ్మం గ్రామీణ మండలం తీర్థాలకు చెందిన భూక్య కృష్ణవేణి, వెంకన్న దంపతులది. కిరాయి ఇంట్లో నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు సంతానం. లబ్ధిదారు పేరును పొరపాటున ఎల్–1 బదులు ఎల్–3 జాబితాలోకి చేర్చారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. ఎల్–1 జాబితాలోకి మార్చి ఇందిరమ్మ ఇల్లు మంజూరుపత్రం అందజేశారు. కూలీనాలీ చేసుకునే దంపతులు రూ.3లక్షలతో ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇప్పుడు చేతిలో చిల్లిగవ్వలేక, పునాది, గోడల నిర్మాణాల బిల్లులు రాకపోవటంతో పనులను ఆపేశారు. అధికారులను ప్రాధేయపడినా బిల్లులు రావటం లేదని వాపోతున్నారు.

సొంతింటి కల నెరవేర్చుకోవటానికి నిర్మాణ పనులు ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు సాంకేతిక కారణాలతో అష్టకష్టాలు పడుతున్నారు. లబ్ధిదారుల జాబితాలో పేరుండటంతో ముగ్గుపోసి పనులు ప్రారంభించిన వారిలో చాలామంది బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అన్నీ సవ్యంగా ఉన్నవారు బిల్లులు తీసుకుంటుంటే.. సిబ్బంది తప్పిదంతో బిల్లులు రాక, ఇంటి పనులు కొనసాగించటానికి డబ్బుల్లేక పలువురు అవస్థలు ఎదుర్కొంటున్నారు.

**సిబ్బంది తప్పిదం.. పేదలకు సంకటం**

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 16,678 గృహాలు మంజూరవగా 12,876 మంది పనులు ప్రారంభించారు. ముగ్గులు పోసినప్పుడు తీసిన ఫొటో లొకేషన్, పునాది దశలోని లొకేషన్‌కు సరిపోలక లబ్ధిదారులకు మొదటి దఫా బిల్లు రాలేదు. దీనిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నారు. ఇటీవల జిల్లాలో 60మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో గృహనిర్మాణశాఖ సిబ్బంది రెండుసార్లు బిల్లులు జమచేశారు. బ్యాంకర్ల సూచన మేరకు తప్పిదాన్ని గుర్తించి ఆ డబ్బులను ఖాతాల్లోంచి వెనక్కి తీసుకున్నారు. అప్పటికే



పునాది, గోడలు, స్లాబ్ దశల వారీగా బిల్లులు తీసుకున్న లబ్ధిదారులకు మరోదశ పనులు చేసుకున్నా డబ్బులు రావటం లేదు. డబుల్ పేమెంట్‌తో ఆగాయని సిబ్బంది చెబుతుండటంతో వారంతా బ్యాంకు స్టేట్‌మెంట్లతో గృహనిర్మాణశాఖ కార్యాలయాన్ని ఆశ్రయిస్తున్నారు. పరిష్కార మార్గం తెలియక జిల్లా అధికారులూ తలలు పట్టుకుంటున్నారు.

**జాబితా మారినా.. జాతకాలు మారలే..**

ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హుల ఎంపికకు సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి దరఖాస్తుదారుల ఫొటోలు తీసుకున్నారు. ఈక్రమంలో కిరాయి ఇంట్లో నివసిస్తున్న పేదలకు డాబా ఇల్లు ఉన్నట్లు, పెంకుటిల్లు కలిగిన వారికి బిల్డింగ్ ఉన్నట్లు నమోదవటంతో వారి పేర్లన్నీ ఎల్–3 జాబితాలో చేర్చారు. ఇలా జిల్లాలో 2,500 మంది ఉండగా.. మళ్లీ అధికారులు విచారించి అర్హులుగా తేల్చి ఎల్–1లోకి మార్చారు. ఎల్–1 జాబితాలోని వారి బ్యాంకు ఖాతాల్లో బిల్లులు జమవుతున్నాయి. ఎల్–3 నుంచి మారిన వారికి రావటం లేదు. 'జాబితా మారినవారు, డబుల్ పేమెంట్ జరిగిన లబ్ధిదారుల జాబితాను ఎండీ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో బిల్లులు మంజూరవుతాయి' అని గృహనిర్మాణశాఖ పీడీ శ్రీనివాస్‌కు తెలిపారు.

## భూమికి ఆధారం.. భూధార్..!

ఖమ్మం: ఒక్కో వ్యక్తికి ఆధార్ సంఖ్య ఉన్నట్లుగానే ప్రతి కమతానికీ ప్రత్యేక సంఖ్య కేటాయించటానికి పైలెట్ గ్రామాల్లో సర్వే చేస్తున్న విషయం తెలిసిందే. మొదటి దశలో రాష్ట్రస్థాయిలో ఎంపికైన పైలెట్ గ్రామాల్లో ఒకటైన ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమాడులో డీజీపీఎస్(డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం) సర్వే పూర్తిచేశారు. 103 సర్వే నంబర్లలోని 845.32 ఎకరాలను ప్రత్యేక బృందాలు కొలిచి నక్షాలు రూపొందించాయి. అక్షాంశాలు, రేఖాంశాలతో కూడిన 875 డిజిటల్ మ్యాపులను రూపొందించి ఎన్ఐసీ(నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్)కి పంపించారు. అక్కడి నుంచి అనుమతులు వచ్చాక ఆ గ్రామంలో భూధార్ కార్డులు పంపిణీ చేయనున్నారు.

**పైలెట్ గ్రామాల్లో సర్వేకు సన్నద్ధం**

భూధార్ కార్డుల జారీకి తాజాగా భద్రాద్రి జిల్లాలోని ఏడు మండలాల్లో ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేశారు. ప్రధానంగా నక్షా, భూదస్త్రాలు సక్రమంగా లేని పల్లెలను ఎంచుకొని డీజీపీఎస్ సర్వేకు సన్నద్ధమవుతున్నారు. కాలవలనాగారం(కరకగూడెం మండలం), మాధారం (ములకలపల్లి), అకినేపల్లి(దమ్మపేట), గుండాల మండలకేంద్రం, దుర్దాలపాడు(అశ్వారా



పుపేట), పెద్దవెంకటాపురం(ఆళ్లపల్లి), సుబ్బంపేట (చర్ల) గ్రామాలు ఎంపికవగా.. వీటిల్లో సర్వే చేయనున్నట్లు ఇప్పటికే గ్రామస్తులకు సమాచారం అందించారు. తరువాత కలెక్టర్, అదనపు కలెక్టర్, సర్వే, భూదస్త్రాల సహాయ సంచాలకులు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి డ్రోన్లు, రోవర్లతో జరిపే సర్వే తీరు, ఒనగూరే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తారు. ఏ దిక్కు నుంచి సర్వే ప్రారంభిస్తారనే అంశంపై నోటీసులు అందజేస్తారు. సర్వే పూర్తయ్యాక, డిజిటల్ మ్యాపులు రూపొందించి అభ్యంతరాలూ స్వీకరిస్తారు. వాటిని పరిష్కరించి భూధార్ కార్డులు పంపిణీ చేస్తారు.

**ప్రయోజనాలు ఇలా..**

ప్రతి కమతానికి ప్రత్యేక సంఖ్యతో భూధార్ కార్డులు పంపిణీ చేస్తారు. ప్రతి కమతం వివరాలను కంప్యూటరీకరిస్తారు. ఆన్‌లైన్‌లో చిటికెలో భూవిస్తీర్ణం, సరిహద్దులు, నేల రకం, ఎలా సంక్రమించింది, మ్యాప్ తదితర సమగ్ర సమాచారం లభిస్తుంది. బైసర్వే నంబర్ల సమస్య ఉండదు. సర్కారు, ప్రైవేటు భూముల లెక్క పక్కాగా ఉంటుంది. నకిలీ పత్రాల సృష్టి, భూఆక్రమణలకు అడ్డుకట్ట పడుతుంది. ములుగుమాడులో డిజిటల్ మ్యాపులు రూపొందించి అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించాం. ఎన్ఐసీ నుంచి అనుమతులు రాగానే భూధార్‌కార్డులు పంపిణీ చేస్తాం. భద్రాద్రి జిల్లాలో పైలెట్ గ్రామాలు ఏడింటిలో సర్వే చేపట్టనున్నాం. డి.శ్రీనివాసులు, సర్వే, భూరికార్డుల శాఖ సహాయ సంచాలకుడు

# కన్నీటి ఊట.. కష్టాల మేట..!

సూర్యాపేట: ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి కురిసిన అకాల వర్షం పత్తి, వరి రైతులను ఆగమాగం చేసింది. కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసి.. పొలాల్లో వరి నేలవాలడంతో కర్షకులు కన్నీరుమున్నీరవుతున్నారు. మరోవైపు చేనుల్లోని పత్తి తడిసి నేలరాలుతోందని వాపోతున్నారు.

**వరి** ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వరి 12,87,781 ఎకరాల్లో సాగవుతోంది. ఇప్పుడిప్పుడే వరి కోతలు మొదలయ్యాయి. ధాన్యాన్ని విక్రయించేందుకు ఆయా ప్రాంతాల్లోని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. అధికారులు కేంద్రాలను ప్రారంభించినా.. తూకాలు కావడం లేదు. ఫలితంగా భారీ వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. కొన్ని చోట్ల వరదలో కొట్టుకుపోయింది. కోత దశలో ఉన్న పైర్లు నేలవాలి నష్టం కలిగింది.

**ఉప్పుతో ఉపకారం:** తడిసిన ధాన్యం, పొలాల్లోని వరి కంకులు మొలకెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త ఎ.కిరణ్ సూచించారు. పొలాల్లో గింజలు నేలకు తాకితే నీరు నిల్వ ఉండకుండా కాల్వలు తీయాలి. వరిపైరు గాలివానకు నేలవాలకుండా జడలు కట్టుకోవాలి. పొలంలో తేమ ఉంటే లీటరు నీటికి 2 గ్రాముల ఉప్పు కలిపి పిచికారీ చేయాలి. తడిసిన ధాన్యానికి క్వింటాకు కిలో చొప్పున ఉప్పు కలిసి ఆరబెట్టాలి. అప్పుడు మొలక శాతం తగ్గి రంగు మారకుండా కాపాడుకోగలుగుతాం.

**పత్తి** మూడు జిల్లాల్లో మొత్తం 7,65,130 ఎకరాల్లో పత్తి సాగవుతోంది. వరుస వర్షాలు.. తెగుళ్లతో పంటకు తీవ్రనష్టం వాటిల్లింది. ఏదోలా తేరుకున్నాం.. ఏరివేతలు చేపట్టి ఇళ్లకు తరలించే సమయంలోనే అకాల వర్షానికి చేనుల్లోని దూది అంతా తడిసి ముద్దయిందని రైతులు ఆవేదనకు గురవుతున్నారు. పొలంలో వరద చేరి పత్తి ఏరివేతలకూ వీలులేకుండా ఉంది. ఇలానే రెండు రోజులపాటు కురిస్తే పత్తి



మొలకెత్తనుందని వాపోతున్నారు. ఈసారి వానలతో పెట్టుబడులు కూడా పూడేలా లేదని ఆందోళన చెందుతున్నారు.

**పత్తిలో సస్యరక్షణ:** పూత, కాత, కాయ పగిలే దశలో ఉన్న పత్తి పంటను వర్షాలకు నష్టం జరగకుండా తగిన సస్యరక్షణ చర్యలతో కాపాడుకోవచ్చని గడ్డిపల్లి కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డి.ఆదర్శ్ పేర్కొన్నారు. కాయపై మచ్చలు, కాయలు కుళ్లకుండా ముందస్తుగా 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్, 0.1గ్రా. ప్లాంటామైసిన్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తెగుళ్లు నివారణ, మొక్క ఎదుగుదలకు 2.5 గ్రా. కార్బండిజం, మ్యాంకోజెబ్, 5గ్రా. 13:0:45 లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**దిగుబడి తగ్గింది: ఉప్పుల శ్రీనివాస్, నూతనకల్**

గతేడాది రెండెకరాల్లో పత్తి సాగు చేస్తే ఎకరాకు 8 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వచ్చింది. విక్రయిస్తే ఖర్చులు పోను రూ.27 వేలు మిగిలాయి. ఈసారి వరుస వర్షాలకు పంటంతా దెబ్బతింది. ఎకరాకు 2 క్వింటాళ్ల దిగుబడి వచ్చేలా ఉంది. ఎకరాకు రూ.25 వేల చొప్పున ఖర్చు చేస్తే చివరకు ఎకరాకు రూ.7 వేలు నష్టపోవాల్సిన పరిస్థితి ఉంది.

# మార్పుతోనే 'స్వచ్ఛ'త!

సూర్యాపేట : స్వచ్ఛ సర్వేక్షణ్ 2025లో పురపాలికలు మెరుగైన ర్యాంకు సాధించాలంటే ప్రజల్లో మార్పు రావాలి. ఇందుకు పుర అధికారులు కూడా సహకారం అందించాలి. కానీ.. జనం ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు పారబోస్తున్నారు. మున్సిపల్ వాహనాలు వచ్చినప్పుడు ఇంటి వద్ద లేకపోతే సాయంత్రం కాలనీల్లో కుప్పగా పడేస్తున్నారు. వీటిలో మార్పు వస్తే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకు సాధించే అవకాశం ఉంటుంది. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు స్వచ్ఛతా హీ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో పరిశుభ్రతపై పుర అధికారులు అవగాహన కల్పించారు.

**ఇలా చేద్దాం**

గృహాల్లో ఉత్పత్తి అయిన తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా సేకరించేలా ప్రణాళిక రచించాలి. ఇప్పటికే కొన్ని పురపాలికల్లో అమలవుతుండగా మిగతా ప్రాంతాల్లో కార్యాచరణకు దిగడం లేదు. చెత్త సేకరణ ఆటోలు ఇళ్ల ముందుకు వెళ్లినప్పుడు వేర్వేరుగా వ్యర్థాలను ఇవ్వాలని సిబ్బంది చైతన్యపర్చాలి. మురుగు కాల్వల్లో వ్యర్థాలు పారేయొద్దని అవగాహన కల్పించాలి. ఆయా బడుల విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను చైతన్య కార్యక్రమాల్లో భాగస్వాములు చేయాలి.



**నా వంతు కర్తవ్యం' నినాదంతో..**

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 19 పురపాలికల్లో స్వచ్ఛతా హీ కార్యక్రమంలో 'నా వంతు కర్తవ్యం' అనే నినాదంతో ముందుకెళ్లారు. తడి చెత్తతో ఎరువులు తయారీ కావడంతో వారికి వీటిపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, సీసాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు తదితర వస్తువులను పొడి చెత్త కింద సిబ్బందికి అందించాలని సూచించారు. తద్వారా ఆటోల్లో చెత్త తీసుకెళ్లేటప్పుడు సిబ్బందికి పని సులువవుతుంది. 2025 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకు సాధించేందుకు దోహదపడనుంది.

**మెరుగైన ర్యాంకుకు కృషి: హన్మంతరెడ్డి, పుర కమిషనర్, సూర్యాపేట**

వచ్చే ఏడాది స్వచ్ఛసర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకు సాధనకు కృషి చేస్తున్నాం. ఇటీవల నిర్వహించిన స్వచ్ఛతా హీ కార్యక్రమాలలో ప్రజలను పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాం. పురపాలికల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి స్వచ్ఛతకు కృషి చేస్తాం.

# స్మార్ట్ లైట్ల మాయ.. వెలగకముందే బిల్లుల రికార్డు



కరీంనగర్ : కరీంనగర్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నగరాభివృద్ధి పనులు చేశారు. సిమెంటు రహదారులు నిర్మించిన చోట రోడ్డుకు ఇరువైపులా వీధిదీపాల కోసం ప్రత్యేక స్తంభాలు వేశారు. రాత్రి పూట లైట్లు వెలగాల్సి ఉండగా, ఏళ్ల తరబడి అంధకారం నెలకొంది. ఇదేమిటని గత పాలకవర్గ సభ్యులు అప్పట్లోనే ప్రశ్నించారు. విద్యుత్తు నియంత్రికలు, ప్రత్యేకంగా మీటర్ల కెపాసిటీ పెంచాలనే కారణాలతో దావేసే ధోరణి అవలంబించారు. కొన్ని ప్రాంతాల్లో వెలగకపోవడంతో స్మార్ట్ లైట్ల మాయలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి.

**అనేక చోట్ల అలంకారప్రాయంగా..**

స్మార్ట్‌సిటీ స్తంభాలకు వీధిదీపాలు అలంకారప్రాయంగా ఉన్నాయి. అశోక్‌నగర్, కాపువాడ రోడ్డు, మల్కాపూర్ రహదారి, భాగ్యనగర్, ఆదర్శనగర్ నుంచి కోర్టు రోడ్డు, గాంధీరోడ్డు, పోచమ్మవాడ తదితర ప్రాంతాల్లో కొన్ని స్తంభాలకు లైట్లు ఉండగా అవి వెలగడంలేదు. యజ్ఞవరాహస్వామి ఆలయం రోడ్డులో 25 స్తంభాలు ఉన్నాయి. అందులో ఒక్కటీ వెలగడం లేదు.

**దొరకని విడిభాగాలు**

స్మార్ట్ స్తంభాలకు ఎల్ఈడీ వీధిదీపాలు బిగించగా, వాటి విడిభాగాలు దొరకడం లేదు. నాణ్యత లేని లైట్లు బిగించారు. రెండేళ్ల నిర్వహణ మరిచారు. అంబేడ్కర్ స్టేడియంలో 24 వీధి దీపాలకు ఉన్న విడిభాగాలు దొంగలు ఎత్తుకెళ్లగా, కొత్తవి అమర్చేందుకు సిద్ధంకాగా, విడిభాగాలు ఎక్కడా దొరకడం లేదు. స్థానికంగా దొరకని, నాసిరకం లైట్లు, విడిభాగాలు పెట్టారనే ఆరోపణలున్నాయి. వీధిదీపాలు వెలగకపోవడం, ఏళ్ల తరబడి నిర్లక్ష్యంగా ఉంచారనే ఫిర్యాదులు వస్తుండటంతో తప్పని పరిస్థితిలో నగర పాలక సంస్థ చర్యలు చేపట్టింది. ఒక్కో రోడ్డులో వీటిని పరిశీలిస్తూ కేబుళ్లు కొనుగోలు చేస్తూ లైట్లకు మరమ్మతులు చేస్తున్నారు. కొన్ని చోట్ల కొత్తవి బిగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాంతో బల్దియాకు రూ.లక్షల్లో భారం పడుతుందని అధికారులు చెబుతున్నారు.

**పరిశీలించకుండా.. హడావుడిగా..** స్మార్ట్‌సిటీ స్తంభాలకు సంబంధించిన వీధిదీపాలు వెలుగుతున్నాయా? లేవా? అనేవి కూడా గతంలో పని చేసిన ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించలేదు. ప్రస్తుతం వెలగడం లేదని క్షేత్రస్థాయికి వెళ్లి ఆరా తీస్తే విషయం తెలుసుకొని అవాక్కయ్యారు. స్తంభాలకు కేబుళ్లు వేయకుండానే వదిలేశారు. ఒక్కో స్తంభం మధ్యలో 40 మీటర్ల దూరం ఉంటుంది. మొత్తం స్తంభాలకు కేబుల్స్ వేసి లైట్లు వెలిగించిన తర్వాతే బిల్లులు రికార్డు చేయాల్సి ఉండగా, హడావుడిగా చేశారు. **తనిఖీ చేయిస్తాం: ప్రఫుల్ దేశాయ్, కమిషనర్, నగరపాలక సంస్థ** స్మార్ట్‌సిటీ లైట్లకు సంబంధించిన విషయాలపై ఇంజినీరింగ్ అధికారులతో తనిఖీ చేయిస్తాం. వీటికి సంబంధించిన దస్త్రాలు పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

# పుష్కరకాలం పూర్తి.. ఏదీ అభివృద్ధి?



మల్లాపూర్: వచ్చే గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ప్రభుత్వం అవసరమైన మేర అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉన్నా.. ఆ దిశగా దృష్టి సారించకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో జరిగిన పుష్కరాల సమయాల్లో కొద్దినెలల ముందే హడావుడిగా పనులు మంజూరుచేసి ప్రారంభించినప్పటికి.. సకాలంలో అవి పూర్తికాక గతంలో భక్తులు తీవ్ర ఇబ్బందుల మధ్యే స్వామివారిని దర్శించుకొన్నారు. నేటికి కొన్నిచోట్ల పనులు నిర్మాణ దశలోనే ఉండటం గమనార్హం. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన వాల్గొండ రామలింగేశ్వరాలయంతోపాటు దేవాదాయశాఖ పరిధిలో ఉన్న వెంకట్రావుపేట గంగ గౌరీశ్వర దేవస్థానం పరిధిలోని గోదావరిలో స్నానాలు ఆచరించేందుకు మహారాష్ట్ర వంటి ప్రాంతాల నుంచి లక్షల్లో భక్తులు వస్తుంటారు.

**పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి**

ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతున్న వాల్గొండ రామలింగేశ్వరాలయం(త్రికూటలయం)ను జిల్లాలోనే ప్రముఖ పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ఉమ్మడి ఏపీ ప్రభుత్వ హయాం నుంచి టూరిజంశాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నా అవి బుట్టదాఖలే అవుతున్నాయి. వాల్గొండ గోదావరి ఒడ్డున రిసార్టులు నిర్మించడంతోపాటు నదిపై వంతెన నిర్మాణం చేపట్టి బోటింగ్ సైతం ఏర్పాటు చేసేందుకు ఈ ప్రాంతం అనువైందిగా ఎంపికచేసినా ముందడుగు పడలేదు. పుష్కరఘాట్‌లను విస్తరించడం, దుస్తులు మార్చుకునే గదులు, పారిశుద్ధ్యం నిర్వహణ వంటి పనులు చేయాల్సిఉంది.

**ఏకో టూరిజంపై నీలినీడలు**

వెంకట్రావుపేట గంగ గౌరీశ్వర ఆలయం ప్రకృతి రమణీయతతో ఉంటుంది. నది అందాలు, ప్రకృతి సెలయేళ్లు భక్తులను కనువిందు చేస్తున్నాయి. పూర్తిగా అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న రేవులో గౌరీశ్వర దేవస్థానం నిర్మాణానికి పదేళ్లు గడుస్తున్నా.. అడుగు ముందుకు పడటంలేదు. కేవలం స్లాబ్ వరకు పూర్తయిన అనంతరం పుష్కరాలు రావడంతో పనులు అక్కడే నిలిపివేసి భక్తులకు దర్శనం కల్పించారు. తర్వాత ఆలయ నిర్మాణాన్ని పట్టించుకోలేదు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఈ ప్రాంతాన్ని ఏకో టూరిజంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించినా అది కార్యరూపం దాల్చలేదు. వచ్చే పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతమున్న రహదారిని రెండు వరుసలుగా విస్తరించడం, విద్యుత్తు సౌకర్యం, దుస్తులు మార్చుకునే గదులను ఏర్పాటు చేయడంతోపాటు ఆలయ పనులు చేపట్టాల్సి ఉంది.

# అంగన్‌వాడీలకు మహర్దశ



జగిత్యాల : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలు ఇక తీరనున్నాయి. స్లాబు లీకేజీలు, కిటికీలు సక్రమంగా లేకపోవడం, వెలసిపోయిన గోడలకు సంబంధించి కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో మొత్తం 1065 కేంద్రాలుండగా.. వీటిలో సొంత భవనాలు 286, ఉచిత అద్దె భవనాలు 239, అద్దెకు సంబంధించి 540 ఉన్నాయి. వీటిలో గర్భిణులు, బాలింతలు, టీహెచ్ఆర్ తీసుకుంటున్నవారు, చిన్నారులు లబ్ధి పొందుతున్నారు.

**తొలగిన స్థానిక కోడ్ అడ్డంకి**

ప్రస్తుతం ఎన్నికల కోడ్ తొలగిపోవడంతో వెంటనే అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లాలోని సొంత భవనాలున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నా పెద్ద మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. ఎలాంటి ఆటంకాలు ఏర్పడకూడదన్న ఉద్దేశంతో సమస్యలు పరిష్కరించేందుకు కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. గతంలో ఒక్కో కేంద్రానికి రూ.2 లక్షల చొప్పున మంజూరయ్యాయి.

**రూ.2.50 లక్షల చొప్పున**

ఒక్కో కేంద్రానికి రూ.2.50 లక్షల చొప్పున మరమ్మతుల కోసం 56 కేంద్రాలకు జిల్లా కలెక్టర్ మంజూరు చేశారు. ఈ పనులు పంచాయతీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. అయితే సొంత భవనాలున్న మరో 30 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరమ్మతులు అవసరమని నివేదించగా, నిధుల మంజూరుకు ఆయన సానుకూలంగా స్పందించారు.

**పర్యవేక్షణ తప్పనిసరి**

ప్రభుత్వం చేపట్టే పనులంటేనే ఒకింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారు. గతంలో మల్యాలలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో మరమ్మతులు చేపట్టిన రేకుల షెడ్డులో వర్షం నీరు లీకవడంతో నిర్వాహకులు, లబ్ధిదారులు అవస్థలు పడాల్సి వచ్చింది. ఇందులో నట్టు, బోల్ట్ సక్రమంగా బిగించకపోవడం కారణమని గుర్తించి సరిచేశారు. ఈ లెక్కన మరమ్మతు పనులకు ఎంపిక చేసిన అంగన్‌వాడీల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించాల్సిన అవసరముంది.

**సక్రమంగా జరిగేలా చూస్తాం**

జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేశారు. మధ్యలో ఎన్నికల కోడ్ రావడంతో అభివృద్ధి పనులకు కొంత ఆటంకం ఏర్పడింది. ప్రస్తుతం కోడ్ తొలగిపోవడంతో అభివృద్ధి చేసేందుకు మార్గం సుగమమైంది. త్వరలో మరమ్మతు పనులు మొదలవుతాయి. సక్రమంగా అభివృద్ధి జరిగేలా పర్యవేక్షిస్తాం. డా.నరేశ్, జిల్లా సంక్షేమాధికారి

# నిర్మాణం పూర్తి చేస్తే.. భూముల్ని సస్యశ్యామలం చేస్తా

మోత్కూరు : ప్రజాప్రతినిధుల్లారా..పార్టీ నాయకుల్లారా..! నేను గుర్తున్నానా..?.. ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు, నిరసనల ఫలితంగా మీ ప్రాంతంలోని పడావు భూములకు సాగు నీరందించి సస్యశ్యామలం చేయాలని 2005 ఏప్రిల్ 10న అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే ఉప్పునూతల పురుషోత్తంరెడ్డి శంకుస్థాపన చేసిన బునాదిగానికాల్వను. మూసీనది ద్వారా మక్తాఅనంతారం నుంచి బీబీనగర్, భువనగిరి, వలిగొండ, మోటకొండూరు, ఆత్మకూరు(ఎం), మోత్కూరు, అడ్డగూడూరు మండలం ధర్మారం చెరువు వరకు 98.64 కి.మీ.కాల్వను తవ్వి 5,500 ఎకరాలకు పైగా సాగునీరందించాలని నా నిర్మాణాన్ని చేపట్టారు. ఈ కాల్వ రెండు దశలకు కలిపి రూ.14.53 కోట్లు కేటాయించారు. పనులు నత్తనడకన సాగి ఆగిపోయాయి. మళ్లీ ఉద్యమాలు, పోరాటాలు, నిరసనలు.. 2016లో అప్పటి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ కృషితో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ కాల్వ కోసం రూ.71 కోట్లు మంజూరు చేయగా.. 2017 నవంబరు 5 పనకబండ వద్ద పనులు ప్రారంభించా



రు. మళ్లీ నత్తనడకన సాగి ఆగిపోయాయి. మళ్లీ ఉద్యమాలు, పోరాటాలు, నిరసనలు.. 20 ఏళ్లు గడిచిపోయాయి. కాల్వ పూర్తికాలేదు. ఈ కాల్వ కోసం ఎదురు చూసీచూసీ రైతుల కళ్లు కాయలు కాస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ ఈ ప్రాంతం వాడిగా, తన స్వగ్రామం ధర్మారం చెరువు వరకు ఉన్న ఈ కాల్వను పూర్తిచేయించేందుకు తీవ్ర కృషి చేయడంతో నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రూ.268.65 కోట్ల నిధులను 2024 అక్టోబరు 16న మంజూరు చేసి టెండర్లు పూర్తిచేశారు. పనులు మాత్రం పునఃప్రారంభం కాలేదు. మోత్కూరు మండలం నుంచి ధర్మారం వరకు కాల్వ నిర్మించాల్సి ఉంది. ఆత్మకూరు(ఎం) మండలం నుంచి మోత్కూరు మండలం వరకు కాల్వ అభివృద్ధి, భూనిర్వాసితులకు పరిహారం అందించాల్సి ఉంది. ఈ కాల్వ ద్వారా మూసీనది నీరు కాకుండా బస్వాపురం ప్రాజెక్టు నుంచి నల్గొండ జిల్లా ప్రాంతానికి వెళ్లే కాల్వ ద్వారా గోదావరి జలాలు అందిస్తే పంటలు బాగా పండుతాయని రైతులు అంటున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు నాపై దృష్టి సారించి పనులు పునఃప్రారంభించి, పూర్తిచేస్తే.. ఈ ప్రాంతంలోని బీడు భూములను సస్యశ్యామలం చేస్తా.

# తాకట్టు పెడితేనే.. సౌర వెలుగులు!

కొత్తగూడెం: కేంద్రం అమలుచేస్తున్న పీఎం-కుసుమ్(ప్రధానమంత్రి కిసాన్ ఉర్జా ఏవం ఉత్థాన్ మహాభియాన్) పథకం.. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల రైతులకు అందనంత దూరంలో నిలుస్తోంది. ఈపథకంలో భాగంగా రైతులు తమ భూముల్లో గ్రిడ్‌కు అనుసంధానించేలా సౌరవిద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటుచేసుకోవచ్చు. దీనికి అయ్యే వ్యయంలో కొంతమొత్తాన్ని రైతు భరించాలి. మిగిలిన మొత్తాన్ని బ్యాంకు ద్వారా రుణం పొందాలి. రుణం పొందాలంటే బ్యాంకులు కచ్చితంగా భూములను తాకట్టు(మార్టిగేజ్) అడుగుతున్నాయి. ఉభయ జిల్లాల్లో ఈ పథకానికి ఎంపికైన చాలామంది భూములు 1/70 చట్టం పరిధిలో ఉండటం అడ్డంకిగా మారింది.

**చట్టం ఏం చెబుతోంది..?**

గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరులు తమ భూములను తాకట్టుపెట్టడానికి లేదా బదిలీ చేయటానికి 1/70 చట్టం అనుమతివ్వదు. గిరిజనేతర రైతుల భూములకు భద్రత లేదనే కారణంతో బ్యాంకులు రుణాలిచ్చేందుకు నిరాకరిస్తున్నాయి. గిరిజనులైనప్పటికీ అసైన్డ్ భూములను తాకట్టు పెట్టేందుకు నిబంధనలు అడ్డుగా ఉన్నాయి. 'నిబంధనల ప్రకారం రుణమివ్వాలంటే తాకట్టు తప్పనిసరి. 1/70 చట్టం పరిధిలో ఉన్నందున తాకట్టు పత్రాలు చట్టబద్ధంగా చెల్లవు. అందుకే రుణాలు



ఇవ్వలేకపోతున్నాం' అని భద్రాద్రి జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ రాంరెడ్డి 'ఈనాడు'కు తెలిపారు.

**భద్రాద్రి జిల్లాలోనే అధికం..** భద్రాద్రి జిల్లాలో అత్యధిక భూభాగం 1/70 చట్టం పరిధిలో ఉంటుంది. పీఎం-కుసుమ్ పథకానికి దరఖాస్తు చేసుకున్న చాలామంది రైతులకు బ్యాంకు రుణాలు అందని పరిస్థితి నెలకొంది. ఈ జిల్లాలో 13 దరఖాస్తులు పథకానికి ఎంపికవగా పదకొండు అర్జీలకు సంబంధించి న భూములకు 1/70 చట్టం వర్తిస్తుంది. ఖమ్మం జిల్లాలో 35 దరఖాస్తులు రాగా మూడు అర్జీలు మాత్రమే ఈ చట్టం పరిధిలోకి వస్తాయి.

**ప్రభుత్వం జోక్యం చేసుకుంటేనే..**

ఈసమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాని రైతులు కోరుతున్నారు. బ్యాంకు రుణాలు మంజూరయ్యేందుకు తాకట్టు నిబంధనలను సడలించేలా లేదా ఈప్రాంత రైతులకు ప్రభుత్వమే ప్రత్యేకంగా హామీ ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేయాలని వేడుకుంటున్నారు. 2026 మార్చి 31నాటికి సౌర ప్లాంట్ల ఏర్పాటుకు గడువు ఉంది. ఆలోపు పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. 1/70 చట్టం పరిధిలోని భూములకు బ్యాంకు రుణం ఆలస్యమవుతోంది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఆయా భూముల్లో ప్లాంట్లు ఏర్పాటుచేస్తాం' అని టీజీ రెడ్కో మేనేజర్ అజయ్‌కుమార్‌కు తెలిపారు.




అమరావతి, నవంబరు8 : ప్రజా సమస్యలపై ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. అమరావతిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఇవాళ(శనివారం) పార్టీ బ్యాక్ ఆఫీస్ విభాగాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. బ్యాక్ ఆఫీస్ కార్యకలాపాలతో పాటు ఎమ్మెల్యేలు, మంత్రులు నిర్వహించే కార్యక్రమాలపై సీఎం చర్చించారు. ప్రజా సమస్యలు, వివిధ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు కృషి చేయాలని సూచించారు. ఈ క్రమంలోనే ప్రజావేదిక కార్యక్రమంలో కూడా పాల్గొనాలని ఆదేశాలు జారీ చేశారు సీఎం చంద్రబాబు. ప్రజాప్రతినిధులు వారంలో ఒక రోజు ఖచ్చితంగా ప్రజావేదిక కార్యక్రమం ద్వారా అర్జీలు స్వీకరించాలని ఆజ్ఞాపించారు. నియోజకవర్గ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను జిల్లా స్థాయిలో, అక్కడా పరిష్కారం కానివి రాష్ట్రస్థాయిలో పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి ఎమ్మెల్యే ప్రజల నుంచి వినతులు తీసుకోవడంతో పాటు తమకు వచ్చిన అర్జీలు పరిష్కారమయ్యే వరకు పనిచేయాలని మార్గనిర్దేశం చేశారు. అదే విధంగా ప్రతి ఎమ్మెల్యే, మంత్రి, ఎంపీ ప్రతి నెల ఒకటో తేదీన 'పేదల సేవలో పింఛన్ల పంపిణీ' కార్యక్రమంలో పాల్గొనాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

**సీఎం చంద్రబాబుతో క్రమశిక్షణ కమిటీ భేటీ..** టీడీపీ తిరువూరు నేతల మధ్య నెలకొన్న వివాదంపై రూపొందించిన నివేదికను సీఎం చంద్రబాబుకు ఆ పార్టీ క్రమశిక్షణ కమిటీ అందచేసింది. ఈ క్రమంలో పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబుతో క్రమశిక్షణ కమిటీ భేటీ అయింది.

సీఎంతో కొనకళ్ల నారాయణ, వర్ల రామయ్య, పంచుమర్తి అనురాధ తదితరులు సమావేశమయ్యారు. తిరువూరులో ఎమ్మెల్యే కొలిపూడి శ్రీనివాసరావు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్నీ)ల మధ్య నెలకొన్న వివాదాలపై నివేదిక రూపొందించింది క్రమశిక్షణ కమిటీ. ఇటీవల ఇద్దరు నేతల నుంచి వివరణ తీసుకుంది కమిటీ.

నేతలు ఇచ్చిన వివరణతో పాటు స్థానిక పరిస్థితులపై నివేదిక రూపొందించి అధినేత చంద్రబాబుకు అందచేసింది క్రమశిక్షణ కమిటీ. ఈ నేపథ్యంలో నివేదికను అధ్యయనం చేసి నిర్ణయం తీసుకోనున్నారు సీఎం చంద్రబాబు.




కళ్యాణదుర్గం: తమ జీవితాంతం అనంతపురం నేలకు రుణపడి ఉంటామని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. భక్త కనకదాస జయంతి సందర్భంగా అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో ఆయన కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి మంత్రి లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భక్త కనకదాస జీవితం అందరికీ స్ఫూర్తి అని పేర్కొన్నారు. సామాజిక తత్వవేత్తగా, స్వరకర్తగా సమాజ చైతన్యానికి ఎంతో కృషి చేశారన్నారు. తన కీర్తనలు, రచనలతో ఆధ్యాత్మిక విలువలు పెంపొందించారని వివరించారు. కురబలు తెదేపాకు ఎప్పుడూ అండగా నిలబడ్డారని తెలిపారు. బాలయ్యను మూడు సార్లు గెలిపించి అసెంబ్లీకి పంపిన గొప్ప నేల అనంతపురం అని కొనియాడారు. 2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో చీకటి రాజ్యం చూసినట్లు తెలిపారు. ఏపీ ప్రజల కోసం చేయాల్సిన అన్ని పనులు ఒక్కొక్కటిగా చేసుకుంటూ వస్తున్నట్లు వివరించారు. ఆదరణ పథకం కింద కురబలకు పనిముట్లు అందిస్తామన్నారు.




కిర్లంపూడి: కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరం వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది.

ఓ కారు టైరు పేలడంతో.. అదుపుతప్పి ఆరుగురి పైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులను సోమవరానికి చెందిన కొండబాబు(30), ఆనందరావు(60), ఏలేశ్వరానికి చెందిన రాజు(60)గా గుర్తించారు. బస్సు షెల్టర్‌లో ప్రయాణికులు ఉండగా ఆరుగురిపైకి ఈ కారు దూసుకెళ్లింది. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఘటనాస్థలికి హుటాహుటిన వెళ్లి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు.




మామండూరు: తిరుపతి జిల్లాలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటించారు. మామండూరు అటవీ ప్రాంతాన్ని సందర్శించి అక్కడ అధికారులతో కలిసి మొక్కలు నాటారు.

ఎర్రచందనం, అంకుడు, తెల్లమద్ది, వెదురుతో పాటు శేషాచలంలో మాత్రమే కనిపించే అరుదైన మొక్కలు పరిశీలించి అటవీ అధికారుల నుంచి వివరాలు తెలుసు కున్నారు. నేపియర్ రిజర్వ్ ఫారెస్ట్ వద్ద ఉన్న వాచ్ టవర్ నుంచి మొత్తం అటవీ ప్రాంతాన్ని వీక్షించారు. ఎర్రచందనం స్మగ్లింగ్ నిరోధక ఆపరేషన్స్, టాస్క్ ఫోర్స్, అటవీ సిబ్బంది కూంబింగ్ తదితర వివరాలను డిప్యూటీ సీఎం అడిగి తెలుసుకున్నారు. మంగళంలోని ఎర్రచందనం గోదామును పరిశీలించిన అనంతరం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో అటవీ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

## బస్సు సర్వీసులతో పర్యాటకంగా అభివృద్ధి చెందే అవకాశం: మంత్రి టీజీ భరత్



కర్నూలు: రాష్ట్రంలో విస్తృతంగా బస్సు సర్వీసులు పెంచడం వల్ల పర్యాటకంగా అభివృద్ధి చెందేందుకు ఆస్కారం ఉంటుందని ఏపీ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు నుంచి విశాఖకు నూతనంగా 3 ఏసీ బస్సు సర్వీసులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల బస్సు ప్రమాదాలు జరగడం ఎంతో బాధాకరమన్నారు. ఆటోమేటిక్ స్ప్రింక్లర్ సిస్టమ్ బస్సులో ఉంటే ఇంత మంది ప్రాణాలు పోయేవి కాదన్నారు. బస్సుల్లో భద్రత ప్రమాణాలపై ప్రధాని మోదీకి లేఖ రాసినట్లు తెలిపారు. త్వరలోనే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి చర్చిస్తానన్నారు.

## కాళ్లు, చేతులు కట్టేసి.. కళ్లకు గంతలు కట్టి.. అత్తకు నిప్పు పెట్టిన కోడలు

వేపగుంట: తన అత్త మీద కోపంతో దారుణానికి పాల్పడిందో కోడలు. కాళ్లు, చేతులు కట్టేసి, కళ్లకు గంతలు కట్టి, ఆమెకు నిప్పు పెట్టింది. ఈ అమానవీయ ఘటన విశాఖ జీవీఎంసీలోని 98వ వార్డు అప్పన్నపాలెంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. అప్పన్నపాలెంలోని వర్షిణి అపార్టమెంట్‌లో జయంతి కనకమహాలక్ష్మి (66).. కుమారుడు సుబ్రహ్మణ్య శర్మ, కోడలు లలిత, వారి పిల్లలతో నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం సుబ్రహ్మణ్య శర్మ బయటకు వెళ్లారు. అదే సమయంలో వారి ఇంట్లో నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఆ మంటల్లో కనకమహాలక్ష్మి సజీవ దహనమైంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. టీవీ వద్ద షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగినట్లు కోడలు లలిత పోలీసులకు తెలిపింది. కనకమహాలక్ష్మి మృతదేహం కాలిపోయిన తీరుపై పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం ఇంట్లో పరిశీలించగా.. ఎక్కడా విద్యుదాఘాతం కాలేదని ప్రాథమికంగా నిర్ధరించారు. దీంతో లలితను పలు కోణాల్లో ప్రశ్నించగా.. చివరకు తానే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసుల ఎదుట అంగీకరించినట్టు సమాచారం. తన



అత్తను కాళ్లు, చేతులు కట్టేసి, ఆపై పెట్రోల్ పోసి, నిప్పంటించి పక్కకు తోసేసింది. ఆమె మంటల్లో కాలిపోతున్నప్పుడు కేకలు వినిపించకూడదని పెద్ద సౌండ్ పెట్టి టీవీ చూసింది. అయితే లలిత.. తన అత్తను హతమార్చేందుకు హౌ టు కిల్ ఓల్డ్ లేడీ అనే వీడియోలు చూసినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.

## తుఫాను నష్ట పరిహారంపై మంత్రి కీలక ప్రకటన

అమలాపురం, నవంబర్ 8: మొంథా తుఫాను సమయంలో జిల్లా అధికార యంత్రాంగం సమర్థవంతంగా పనిచేసిందని అనంతరం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అచ్చెన్నాయుడు కొనియాడారు. శనివారం నాడు డీఆర్సీ సమావేశం అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా పునరావాస కేంద్రం నుంచి ఇంటికి వెళ్లేటప్పుడు ప్రతి ఒక్క కుటుంబానికి 3000 రూపాయలు నగదు, 25 కేజీల బియ్యం, నిత్యావసరాలు ఇచ్చి పంపించామన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో హెక్టారుకు 20వేల రూపాయల నష్టపరిహారం ఉండగా.. వైసీపీ ప్రభుత్వం రూ.17 వేలకు తగ్గించిందని విమర్శించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో 25 వేల రూపాయలు చేశామని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన రీ సర్వే వల్ల చాలా సమస్యలు ఉత్పన్నమయ్యాయని తెలిపారు. వారు చేసిన రిసర్వే వల్ల అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, చాలా ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు అతి ప్రధానమైన సమస్య గోదావరి డెల్టా కాలువలని తెలిపారు. ఈ డెల్టా పంట కాలువలు పూడుకుపోవడం వల్ల వ్యవసాయాలు పాడవుతున్నాయని చెప్పారు. ఎంత డబ్బు ఖర్చయినా



సరే ఒక ప్రాజెక్ట్ రూపంలో తీసుకొని నీటిపారుదల వ్యవస్థను బాగు చేసేందుకు ప్రభుత్వ ఆలోచిస్తోందన్నారు. దీని కోసం సమగ్ర సర్వే చేసేందుకు రూ.12 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. టిడ్కో ఇళ్ళను అయిదు సంవత్సరాలు మరుగున పెట్టింది గత వైసీపీ ప్రభుత్వమని మండిపడ్డారు. మార్చ్‌లోగా అన్ని ఇళ్ళను పూర్తిచేసి గృహప్రవేశాలు చేయిస్తామని స్పష్టం చేశారు. తుఫాను పంట నష్టపరిహారం అంచనాలు వచ్చాయని.. వాటిని కేంద్రానికి పంపిస్తున్నామని తెలిపారు. కేంద్రం సహకారంతో త్వరలోనే నష్టపరిహారం అందిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## వివేకా హత్య కేసులో దోషులను జగన్ వెనకేసుకొస్తున్నారు: ఆదినారాయణ రెడ్డి

విజయవాడ: వైకాపా నాయకులు జగన్ మెప్పు కోసం నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని భాజపా ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి విమర్శించారు. విజయవాడలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "అభివృద్ధిని ఓర్చుకోలేని జగన్.. రాష్ట్రం, ప్రజలపై కుట్రలు చేస్తున్నారు. వైకాపా అంతరించిపోయే పార్టీ.. అందుకే అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. ఎవరి హయాంలో ఎంత అభివృద్ధి జరిగిందో ధైర్యం ఉంటే చర్చకు రండి. వైకాపా నాయకులు ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోలేరు. వివేకా హత్య కేసులో దోషులను జగన్ వెనకేసుకొస్తున్నారు" అని ఆదినారాయణరెడ్డి ఆరోపించారు.



## పలు విమానాశ్రయాల్లో సాంకేతిక సమస్యలు.. రామ్మోహన్‌నాయుడు సమీక్ష



దిల్లీ: దిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో తలెత్తిన సాంకేతిక సమస్యలపై పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టి సారించారు. శుక్రవారం రాత్రి పొద్దుపోయే వరకూ ఆయన విమానాశ్రయంలోనే గడిపారు. నిన్న బెంగళూరు విమానాశ్రయంలో కార్యక్రమం పూర్తి చేసుకుని సాయంత్రం మంత్రి దిల్లీకి వచ్చారు. నిన్న సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ఏటీసీలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాజాగా హైదరాబాద్ విమానాశ్రయంతో పాటు పలు చోట్ల సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో ఇవాళ ఉదయం నుంచే అధికారులతో రామ్మోహన్‌నాయుడు సమీక్ష చేపట్టారు. సాంకేతిక సమస్యలు అధిగమించేందుకు అన్ని అంశాలపై ఎయిర్ పోర్టు అథారిటీ, డీజీసీఏ, విమానాశ్రయ అధికారులతో చర్చిస్తున్నారు. దిల్లీ సహా పలు చోట్ల సమస్యలు తలెత్తి విమానాలు ఆలస్యం అవుతుండటంతో రామ్మోహన్ నాయుడు మాల్దీవుల పర్యటన రద్దు చేసుకున్నారు.

## జగన్ పేటీఎం బ్యాచ్ మూల్యం చెల్లించుకోక తప్పదు: పంచుమర్తి అనురాధ

అమరావతి: వైకాపా అధ్యక్షుడు జగన్ పెంచి పోషిస్తున్న పేటీఎం బ్యాచ్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ హెచ్చరించారు. తల్లి, చెల్లిని కూడా వదలకుండా వ్యక్తిత్వ హననం చేయించారని దుయ్యబట్టారు. కల్తీమద్యంతో 30 వేల మంది ప్రాణాలు తీసి ఎందరో తల్లులకు గుండెకోత మిగిల్చారని ఆరోపించారు. తప్పుడు పోస్టులు పెట్టించి జైలుకు పంపుతూ వారి తల్లిదండ్రులకు ఆవేదన మిగుల్చుతున్నారని మండిపడ్డారు. తమ పిల్లలతో జగన్ చేయిస్తున్న వికృత క్రీడ పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భాస్కర్ రెడ్డి లాంటి వాళ్లను ఎందరిని ప్రయోగించినా వారంతా కటకటాల వెనక్కి వెళ్లక తప్పదన్నారు.





## గుంటూరులో 'బాలోత్సవ్'..
## ఆకట్టుకున్న జానపద నృత్య ప్రదర్శనలు

గుంటూరు : ప్రపంచ బాలల పండుగ పేరిట వీవీఐటీయూ ఆధ్వర్యంలో రెండో రోజు 'బాలోత్సవ్' కార్యక్రమం కొనసాగింది. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు జరుగుతున్నాయి. రెండో రోజు చిన్నారుల జానపద నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

డిజిటల్ చిత్ర లేఖనం, సంగీతం, కథారచన, శాస్త్రీయ నృత్యం, సైన్సు ఆవిష్కరణలు, లఘు నాటికలు, జానపద గీతాలు, ఏకపాత్రాభినయం, స్పెల్ బీ, తెలుగు పద్యం, తెలుగులోనే మాట్లాడుదాం, కవితా రచన, లేఖా రచన తదితర విభాగాల్లో చిన్నారులు పాల్గొని ఆకట్టుకున్నారు.

# రాజస్థానీ కన్నెలా జాన్వీ హొయలు

బాలీవుడ్ లో ఫ్యాషనిస్టాలు ఎందరు ఉన్నా అందరినీ డామినేట్ చేసేస్తోంది జాన్వీ కపూర్. జిమ్‌కి వెళ్లినా లేదా యోగా సెషన్స్, మార్కెట్ ప్లేస్ .. ఇంకేదైనా ఫిల్మీ ఈవెంట్ కి అటెండయినా, అక్కడ కళ్లన్నీ జాన్వీపైనే. షో స్టాపర్ గా, ఫ్యాషన్ గేమ్ ఛేంజర్ గా తనను తాను ప్రెజెంట్ చేసుకోవడంలో జాన్వీ కపూర్ ఎప్పుడూ తన ప్రత్యేకతను చాటుకుంటూనే ఉంది. ఈసారి కూడా తనదైన యూనిక్ లుక్ తో యువతరంలో హాట్ టాపిగ్గా మారింది. తాజాగా ఇన్ స్టాలో మరో క్లాసిక్ లుక్ ని షేర్ చేయగా యువతరం మతులు పోగొడుతోంది. ఇది రాజస్తానీ కళంకార్ రూపం. కాటుక కళ్లు, వాలు జడ.. తీక్షణమైన చూపులతో.. అందమైన డిజైనర్ బ్లూ లెహంగాలో జాన్వీ ముగ్ధ మనోహర రూపం అందరినీ ఆకట్టుకుంటోంది. దీనికి వెడ్డింగ్ సీజన్ అంటూ సింపుల్ క్యాప్షన్ ని ఇచ్చింది జాన్వీ. రాజస్థానీ జర్దోసి, కళంకార్ ల మిశ్రమంతో రూపొందించిన ఈ ప్రత్యేకమైన డిజైనర్ డ్రెస్ యువతరాన్ని విపరీతంగా ఆకర్షిస్తోంది. ఇక ఈ భారీతనం నిండిన డిజైనర్ లెహంగాకు తగ్గట్టే మెడలో ధరించిన హారం కూడా భారీతనంతో ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది. తన భుజాల మీదుగా పొడవాటి దుపట్టా మరో ప్రత్యేక ఆకర్షణ. ఈ దుపట్టాను ఎరుపు రంగు



కళంకారీ డిజైన్, నీలి రంగు కళంకారీ జర్దోసి డిజైన్ తో ఎంతో లావిష్ గా తీర్చిదిద్దారు. జాన్వీ ధరించిన బ్లూ కలర్ దుపట్టాపై ఎరుపు రంగు గులాబీల ప్రింట్ కూడా మరింత అందాన్ని పెంచింది. జాన్వీని చూడగానే రాజస్థానీ కన్నె సోయగం మతులు చెడగొడుతోంది! అంటూ బోయ్స్ కామెంట్ చేస్తున్నారు. ఇది రెగ్యులర్ లుక్ కాదు.. సంథింగ్ స్పెషల్ లుక్! అంటూ చాలా మంది అభిమానులు కితాబిచ్చేస్తున్నారు. రొటీన్ కి భిన్నంగా జాన్వీ కపూర్ తనను తాను ఎలివేట్ చేసుకుంటున్న తీరుకు చాలా మంది ఫిదా అయిపోయామని ప్రకటిస్తున్నారు. మొత్తానికి జాన్వీ కొత్త లుక్ కి అద్భుత స్పందన వచ్చింది. ఫ్యాషన్ సెన్స్ పరంగా ట్రెండ్స్ ని ఫాలో చేయడంలో జాన్వీ కపూర్ ఇతర నాయికల కంటే చాలా అడ్వాన్స్ డ్ గా ఉంది. బాలీవుడ్ లో జాన్వీతో పాటు, చాలా మంది నటవారసురాళ్లు తెరంగేట్రం చేసారు. సారా అలీఖాన్, అనన్య పాండే, తారా సుతారియా లాంటి సీనియర్ భామలకు కూడా జాన్వీ ఫ్యాషన్ సెన్స్ పరంగా తీవ్రమైన పోటీని ఇస్తోంది. ఇక ఖుషి కపూర్ తన సోదరి జాన్వీని ఫాలో చేసేందుకు ప్రయత్నిస్తున్నానని చెప్పింది. మొత్తానికి ఫ్యాషనిస్టా వైబ్ గురించి ప్రస్థావించాలంటే నేటితరం భామలు జాన్వీని తలుచుకోవాల్సిందే. కెరీర్ మ్యాటర్ కి వస్తే, జాన్వీకపూర్ తదుపరి పెద్ది చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. దేవరలో ఎన్టీఆర్ సరసన నటించిన జాన్వీ వెంటనే చరణ్ సరసన పెద్దిలో అవకాశం దక్కించుకుంది. జాన్వీకి ఇద్దరు అగ్ర హీరోల సరసన బ్యాక్ టు బ్యాక్ నటించే అవకాశం వచ్చింది. ఎన్టీఆర్- కొరటాల దేవర 2ని ప్రకటించిన సంగతి తెలిసిందే. బాలీవుడ్‌లో ఇటీవలే సన్నీ సంస్కారీకి తులసీ కుమారి చిత్రంలో నటించింది. రోమ్ కామ్ జానర్‌లో వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద యావరేజ్‌గా ఆడింది.

# ప్రభాస్ సినిమా కోసం ఆలిమ్ హకీమ్..!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ త్వరలో ది రాజాసాబ్, ఫౌజీ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతున్నాడు. ఆ సినిమాలు విడుదల కాక ముందే 'స్పిరిట్' సినిమాను పట్టాలెక్కించే అవకాశాలు ఉన్నాయి. అర్జున్ రెడ్డి, యానిమల్ సినిమాలతో పాన్ ఇండియా దర్శకుడిగా నిలిచిన సందీప్ రెడ్డి వంగ దర్శకత్వంలో స్పిరిట్ సినిమా రూపొందబోతుంది. ఈ సినిమా ప్రకటించి దాదాపు రెండు ఏళ్లు కాబోతున్నా ఇప్పటి వరకు కనీసం షూటింగ్ ప్రారంభం కాలేదు. ప్రభాస్ ఇతర కమిట్‌మెంట్స్‌తో బిజీగా ఉండటంతో పాటు, ఇతర కారణాల వల్ల ఈ సినిమా ఆలస్యం అవుతుందని తెలుస్తోంది. ఆలస్యం అవుతున్నా కొద్దీ ఈ సినిమా వెయిట్ పెరుగుతుంది అనడంలో సందేహం లేదు. సినిమా షూటింగ్ ప్రారంభం కోసం ప్రభాస్ అభిమానులు మాత్రమే కాకుండా అన్ని వర్గాల వారు వెయిట్ చేస్తున్నారు.



**సందీప్ వంగ దర్శకత్వంలో స్పిరిట్...** స్పిరిట్ సినిమా షూటింగ్ ప్రారంభం ఎప్పుడు అనే విషయం ఇప్పటివరకు క్లారిటీ లేదు, కానీ రకరకాలుగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ముఖ్యంగా ఈ సినిమాలో నటీనటుల గురించి, సాంకేతిక నిపుణుల గురించి, ఇంకా కథ, స్క్రీన్‌ప్లే గురించి కూడా ఎవరికి తోచిన విధంగా వారు మాట్లాడుతున్నారు, తమ విశ్లేషణలు వినిపిస్తున్నాయి. కానీ ఇప్పటి వరకు సందీప్ రెడ్డి వంగ నుంచి ఇప్పటి వరకు క్లారిటీ రాలేదు. ఈ సినిమాలో మొదట దీపికా పదుకునేను హీరోయిన్‌గా తీసుకున్న విషయం తెల్సిందే. కానీ కొన్ని కారణాల వల్ల ఆమెను తొలగించి ఆ స్థానంలో యానిమల్ హీరోయిన్ త్రిప్తి డిమ్రిని ఎంపిక చేయడం జరిగింది. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ వర్క్ చేస్తున్నారని, వర్క్ షాప్ సైతం నిర్వహిస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. దర్శకుడు త్వరలోనే పూర్తి వివరాలను వెల్లడించే అవకాశాలు ఉన్నాయి.
**ప్రభాస్ కి జోడీగా త్రిప్తి డిమ్రి...** ఇక ఈ సినిమాలోని ప్రభాస్ లుక్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారట. ముఖ్యంగా ప్రభాస్ హెయిర్ స్టైల్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు అనే వార్తలు వస్తున్నాయి. ఈమధ్య కాలంలో ప్రముఖ హెయిర్ స్టైలిస్ట్ ఆలిమ్ హకీమ్ పేరు బాగా వినిపిస్తుంది. ఆయన ఎంతో మంది హీరోలకు హెయిర్ స్టైల్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తున్నాడు. ఈ సినిమా కోసం కూడా ఆయన్ను రంగంలోకి దింపేందుకు ఒప్పందాలు జరిగాయి. ప్రభాస్‌ను చాలా యూనిక్‌గా ఇప్పటి వరకు ఏ ఒక్కరూ చూపించన విధంగా, మరే సినిమాలో చూడని విధంగా ఆలిమ్ హకీమ్ చూపించేందుకు గాను ఇప్పటికే వర్క్ మొదలు పెట్టాడు అంటూ ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తుంది. సందీప్ వంగ దర్శకత్వంలో గతంలో వచ్చిన సినిమాలకు ఆయన హెయిర్ స్టైలిస్ట్‌గా వర్క్ చేశాడు.




# 'అఖండ 2' తాండవం సాంగ్ ప్రోమో.. పూనకాలు వచ్చేలా థమన్ ప్లాన్




'అఖండ'.. ఈ పేరు వింటేనే మాస్ ఫ్యాన్స్ కి గూస్‌బంప్స్ గ్యారెంటీ. ముఖ్యంగా థమన్ ఇచ్చిన ఆ బీజీఎం ఇప్పటికీ సోషల్ మీడియాలో మోగుతూనే ఉంటుంది. ఇప్పుడు ఆ పూనకం లోడింగ్‌ను డబుల్ చేసేందుకు బాలకృష్ణ బోయపాటి కాంబో 'అఖండ 2'తో రెడీ అయింది. ఈ సీక్వెల్ నుంచి ఫస్ట్ మ్యూజికల్ అప్‌డేట్ వచ్చేసింది. "అఖండ తాండవం" అంటూ సాగే ఫస్ట్ సింగిల్ ప్రోమోను మేకర్స్ వదిలారు. ఈ ప్రోమోతోనే థమన్ "మ్యూజికల్ స్ట్రామ్" మొదలుపెట్టేశాడు. విజువల్స్ చూస్తే, మంచు కొండలు, పురాతన ఆలయాల మధ్య బాలయ్య అఘోరా గెటప్‌లో నడుస్తూ, ఢమరుకంతో ఇంటెన్స్ స్టెప్స్ వేస్తూ కనిపించారు. ఆ బ్యాక్‌డ్రాప్‌లో "హర హర మహాదేవ్.. ఓం నమః శివాయ" అనే సౌండ్, హెవీ డ్రమ్ బీట్స్.. ఫస్ట్ పార్ట్‌ను మించిపోయే వైబ్ ఇస్తున్నాయి. ఈసారి థమన్ వేసిన స్కెచ్ మామూలుగా లేదు. ఈ ఒక్క "తాండవం" పాట కోసం ఏకంగా ఇద్దరు మ్యూజికల్ లెజెండ్స్‌ను రంగంలోకి దించాడు. పవర్‌ఫుల్ వాయిస్‌కు కేరాఫ్ అడ్రస్ అయిన శంకర్ మహదేవన్, దేవుడి పాటలకు పెట్టింది పేరైన కైలాష్ ఖేర్.. ఈ ఇద్దరూ కలిసి ఈ పాటకు గొంతు కలిపారు. ఈ కాంబినేషన్ సెట్ అవ్వడమే ఒక పెద్ద హైలైట్. ప్రోమోలో వినిపించిన బీట్స్, ఆ ఇద్దరి వాయిస్ పవర్.. బోయపాటి మార్క్ ఎలివేషన్ సీన్స్‌కు, బాలయ్య అఘోరా గెటప్‌కు ఏ రేంజ్‌లో సెట్ అవుతాయో శాంపిల్ చూపించారు. కళ్యాణ్ చక్రవర్తి రాసిన పవర్‌ఫుల్ లిరిక్స్ కూడా ఈ పాటకు అదనపు బలం కానున్నాయి. ఈ ప్రోమోతోనే ఫ్యాన్స్ ఫుల్ ఖుషీలో ఉన్నారు. "థియేటర్ల స్పీకర్లు బద్దలవ్వడం ఖాయం," "ఇది పాట కాదు, ఒక పూనకం" అంటూ కామెంట్స్ పెడుతున్నారు. నందమూరి ఫ్యాన్స్ ఈ మ్యూజికల్ బ్లాస్ట్ కోసం ఎక్కువ రోజులు వెయిట్ చేయాల్సిన పనిలేదు. ప్రస్తుతం ఈ ప్రోమో యూట్యూబ్‌ను షేక్ చేస్తుండగా, ఫుల్ లిరికల్ సాంగ్‌ను నవంబర్ 14న విడుదల చేయనున్నారు. ఇక అసలు సినిమా 'అఖండ 2', డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈసారి రచ్చ డబుల్ అని ఫిక్స్ అవ్వొచ్చు.


# తారక్ నమ్మకాన్ని నీల్ నిలబెట్టుకుంటారా?



కేజీఎఫ్-2, సలార్ వంటి సినిమాలతో బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకున్న స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్.. ఇప్పుడు టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్ తో వర్క్ చేస్తున్న విషయం తెలిసిందే. హై వోల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కుతున్న ఆ చిత్రంలో సప్త సాగరాలు దాటి ఫేమ్ రుక్మిణీ వసంత్ కథానాయికగా కనిపించనుంది. ప్రముఖ మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్ పై కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తున్నారు. డ్రాగన్ అనే టైటిల్ ను ఫిక్స్ చేసినట్లు సినీ వర్గాల్లో ఎప్పటి నుంచి టాక్ వినిపిస్తోంది. కానీ మేకర్స్ దానిని అధికారికంగా ప్రకటించలేదు. అయితే తారక్ లైనప్ లో అనేక సినిమాలు ఉన్నప్పటికీ.. ఇప్పుడు నీల్ తో చేస్తున్న మూవీపై ఆయన భారీ హోప్స్ పెట్టుకున్నారని చెప్పాలి. ఎందుకంటే రీసెంట్ గా ఆయన నటించిన బాలీవుడ్ డెబ్యూ వార్-2 మూవీ బోల్తా పడింది. భారీ అంచనాల మధ్య రిలీజ్ అయిన ఆ సినిమా.. తెలుగు ఆడియన్స్ ను పెద్దగా ఆకట్టుకోలేదు. దీంతో తారక్.. నీల్ మూవీతో గట్టి కమ్ బ్యాక్ ఇవ్వాలని చూస్తున్నారు. వచ్చే ఏడాది జూన్ 25వ తేదీన థియేటర్స్ లో రానున్నారు. అదే సమయంలో ఇప్పుడు సోషల్ మీడియాలో ఓ విషయం వైరల్ గా మారింది. పాన్ ఇండియా చిత్రాలను రూపొందించే టాలెంట్ ఫుల్ గా ఉన్న నీల్.. ఇప్పుడు తారక్ మూవీని వేరే రేంజ్ లో తీస్తున్నారట. ప్రశాంత్ నీల్ సూచనలను తారక్ అన్నీ ఫాలో అవుతున్నారని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఆయనపై భారీ నమ్మకాన్ని పెట్టుకున్నట్లు తెలుస్తోంది. పూర్తిగా నీల్ ఫోకస్ కు కట్టుబడి ఉన్నారని సమాచారం. మొత్తానికి జూనియర్ ఎన్టీఆర్ నమ్మకాన్ని నీల్ ఎంతవరకు నెలబెట్టుకుంటారో.. ఎలాంటి హిట్ అందిస్తారో ఆసక్తికరం. అయితే రీసెంట్ గా ఎన్టీఆర్- ప్రశాంత్ నీల్ మూవీ షూటింగ్ ఉత్తర కన్నడలోని కుంటాలో జరిగినట్లు తెలుస్తోంది. అక్కడ ఒక ఫ్యాక్టరీ సెట్ ను నిర్మించారని సమాచారం. 10 రోజులకు పైగా షూటింగ్ అక్కడే జరిగిందట. ఇప్పుడు తారక్ రిలాక్సడ్ మోడ్ లో ఉన్నారని టాక్. మరికొద్ది రోజుల్లో కొత్త షెడ్యూల్ మొదలుకానుందని వినికిడి. హైదరాబాద్ లో భారీ వ్యయంతో సెట్ ను నిర్మిస్తున్నారట.

# చీరకట్టులో హృదయాన్ని తాకుతున్న మానస చౌదరి!

ఈ మధ్యకాలంలో సెలబ్రిటీలు గ్లామర్ తోనే కాదు సాంప్రదాయంగా ఆకట్టుకుంటూ అభిమానులలో గౌరవాన్ని పెంచుకుంటున్నారు. మరి కొంతమంది ఆ చీరకట్టులో కూడా గ్లామర్ వలకబోస్తూ ఫ్యాన్స్ ను ఫిదా చేస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా చీరకట్టులో కనిపించి, యువత హృదయాన్ని తాకుతూ అందరి దృష్టిని ఆకర్షించింది యంగ్ బ్యూటీ మానస చౌదరి. తాజాగా చీరకట్టులో దర్శనమిచ్చిన ఈమె.. తన అందాలతో అభిమానులను ఆకట్టుకుంది. సాంప్రదాయంగా కనిపిస్తూ తనపై గౌరవాన్ని మరింత పెంచుకుంది అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. విషయంలోకి వెళ్తే.. ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ ఫాలోవర్స్ ను పెంచుకుంటూ అభిమానులకు చేరువవుతున్న నటీమణులలో మానస చౌదరి కూడా ఒకరు. ప్రస్తుతం సోషల్ మీడియాలో పర్పుల్ ట్రెండ్ నడుస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే ఇటు సెలబ్రిటీలు కూడా పర్పుల్ కలర్ డ్రెస్సులు, చీరలు ధరించి ట్రెండు ని బాగా యూజ్ చేసుకుంటున్నారు. అందులో భాగంగానే తాజాగా మానస చౌదరి కూడా ఇలా పర్పుల్ కలర్ చీర ధరించి తన అందాన్ని రెట్టింపు చేసుకుంది. సింగిల్ ప్లేర్ తో పైను సరిచేసిన ఈమె.. తన జుట్టును గాలికి వదిలేసి తన స్టైలిష్ లుక్కును కంప్లీట్ చేసింది. ఈ చీర కట్టులో ఎంతో అందంగా ముద్దుగా కనిపిస్తోంది అంటూ



అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం మానస చౌదరికి సంబంధించిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. మానస చౌదరి కెరియర్ విషయానికి వస్తే.. సుమా కొడుకు రోషన్ కనకాల హీరోగా వచ్చిన బబుల్గం చిత్రం ద్వారా ఇండస్ట్రీకి పరిచయమైంది తెలుగు అమ్మాయి మానస చౌదరి. ఈ సినిమా ప్రమోషన్స్ లో పాల్గొన్న ఈమె తన బ్యాక్ గ్రౌండ్ గురించి కూడా చెప్పుకొచ్చింది. మానస చౌదరి మాట్లాడుతూ.." నేను చిత్తూరు జిల్లా పుత్తూరులో జన్మించాను. కానీ చెన్నైలో పెరిగాను. మా నాన్న వ్యాపారం చేస్తారు. నాకు ఎటువంటి సినిమా నేపథ్యం లేదు. నిజానికి నేను ఇండస్ట్రీలోకి రావాలనుకోలేదు. కానీ కాలక్రమేనా సినిమాపై ఇష్టం పెరిగి, ఇండస్ట్రీలోకి వచ్చాను . ఇదే విషయాన్ని మొదటి మా అమ్మ నాన్నతో చెబితే వారు కూడా నాకు తమ ప్రోత్సాహాన్ని అందించారు. తల్లిదండ్రుల సహాయంతో చదువు పూర్తి చేసి, మోడలింగ్ ప్రారంభించాను. అదే సమయంలో ఒక ఫ్రెండ్ ద్వారా దర్శకుడు రవికాంతకు నా ప్రొఫైల్ పంపించి..ఆయన టీం నుంచి కాల్ రావడంతో ఫోటోషూట్ చేసాము. అలా నా సినిమా జర్నీ మొదలైంది అంటూ మానస చౌదరి తన సినీ కెరియర్ గురించి చెప్పుకొచ్చింది. ఇకపోతే బబుల్గం సినిమాలో మానస చౌదరి చేసింది తొలిసారి అయినా ఈమె ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీకి అభిమానులు ఫిదా అవుతున్నారు. అద్భుతమైన నటన కనబరిచింది అంటూ ఆమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు. మొత్తానికైతే మొదటి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించింది మానస చౌదరి

# హారర్ వరల్డ్ లోకి నేషనల్ క్రష్!

నేషనల్ క్రష్ కెరీర్ దేదీప్యమానంగా సాగిపోతుంది. తెలుగు, హిందీ సినిమాలతో క్షణం తీరిక లేకుండా గడుపుతోంది. స్టార్ హీరోలే టార్గెట్ గా సినిమాలు చేస్తోంది. మరోవైపు లేడీ ఓరియేంటెడ్ నాయికగానూ సత్తా చాటే ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇప్పటికే బాలీవుడ్ లో ఛావా సినిమాతో యేసుభాయ్ భోంస్లే పాత్రతో నటిగా తన స్థాయిని పెంచుకుంది. హీరోల సరసన రొమాంటిక్ రోల్సే కాదు అవసరమైతే స్ఫూర్తి నింపే పాత్రల్లోనూ సత్తా చాటుతుందని యేసుబాయి పాత్రతో రుజువు చేసింది. ఈ పాత్ర రష్మికకు బాలీవుడ్ లో ప్రత్యేకమైన గుర్తింపును తీసుకొచ్చింది. అరుదుగా కీలక పాత్రల్లో సైతం మెప్పింస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా హారర్ హిట్ ఫ్రాంచైజీలోనూ భాగమవుతోంది. %-%కాంచన%-% సిరీస్ లో భాగంగా లారెన్స్ కాంచన 4ని రెడీ చేస్తోన్న సంగతి తెలిసిందే. ఆయన స్వీయా దర్శకత్వంలో తెరకెక్కి స్తోన్న చిత్రమిది. సినిమాలో ఇప్పటికే పూజాహెగ్డే, నోరా పటేహీలు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఇదే సినిమాలో రష్మికను ఓ ప్రత్యేక పాత్ర కోసం సంప్రదించారుట. లారెన్స్



ఇటీవలే ఆమెను కలిసి పాత్ర గురించి వివరించారు. రష్మిక కూడా పాజిటివ్ గా స్పందించిదని సమాచారం. ఇదే నిజమైతే కాంచన 4 రేంజ్ మారిపోతుంది. రష్మిక భాగ మైందంటే? ఆ సినిమాకు పాన్ ఇండియాలో క్రేజ్ మామూలుగా ఉండదు. తెలుగు అభిమా నులను మంచి బాలీవుడ్ లో క్రేజ్ సంపాదించిన బ్యూటీ రష్మిక. ఈ నేపథ్యంలో కాంచన 4ని అక్కడా కూడా భారీ ఎత్తున రిలీజ్ చేసే అవకాశం ఉంటుంది. రష్మిక సక్సెస్ సెంటిమెంట్ కూడా వర్కౌట్ అవు తుంది. గతంలో సీతారామం చిత్రంలోనూ నేషనల్ క్రష్ ఓ కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఆ సినిమా కూడా పాన్ ఇండియాలో పెద్ద విజయం సాధించింది. ఎలాంటి అంచనాలు లేకుండానే సంచలనాలు నమోదు చేసిందా చిత్రం. ఆరకంగా కాంచన 4కి ఇదొక పాజిటివ్ సైన్ గా చెప్పొచ్చు. ప్రస్తుతం రష్మిక బాలీవుడ్ లో థామాలో నటిస్తోంది. అలాగే తెలుగులో %-%ది గర్ల్ ఫ్రెండ్%-% లో నటిస్తోంది. ఈ రెండు చిత్రాలపై మంచి అంచనాలున్నాయి. సెప్టెంబర్...అక్టోబర్ లో రిలీజ్ కు రెడీ అవుతున్నాయి.




హైదరాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన హామీల గురించి సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడరని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నించారు. హామీల అమలులో సీఎం రేవంత్ వైఫల్యం చెందారని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. "ప్రజల దృష్టి మళ్లించేందుకు నాపై, భాజపాపై రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. భారత రాష్ట్ర సమితి, భాజపా కలిసిపోయాయని తప్పుడు ప్రచారం చేశారు. గతంలోనూ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇలానే చేశారు. నాపై వ్యక్తిగత విమర్శలకు దిగినా.. నేను భయపడను. తెలంగాణ అభివృద్ధి విషయంలో రేవంత్ సర్టిఫికెట్ నాకు అవసరం లేదు. ఈ రాష్ట్ర అభివృద్ధికి భాజపా ఏం చేసిందో ప్రజలకు తెలుసు. ఆ రెండు పార్టీల మాదిరి భాజపా అవినీతి, కుటుంబ పార్టీ కాదు. ఇచ్చిన హామీలు అమలు చేయడమే భాజపాకు తెలుసు. మా పాలనపై చిన్న అవినీతి ఆరోపణ కూడా రాలేదు. ఫేక్ వీడియోలతో మా పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తెలంగాణ అభివృద్ధిపై నా వివరణ వినే ధైర్యం కేసీఆర్, రేవంత్‌రెడ్డికి ఉందా? కాంగ్రెస్ హైకమాండ్‌కు భయపడి రేవంత్‌రెడ్డి.. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవడం లేదు. సీఎం రేవంత్ రెడ్డిది ఫెయిల్యూర్ ప్రభుత్వం" అని కిషన్ రెడ్డి మండిపడ్డారు.

## ప్రభుత్వం సహకరించకున్నా.. విద్యా సంస్థలు నడుపుతున్నాం..




హైదరాబాద్: తనపై సీఎం రేవంత్ చేసిన ఆరోపణలకు వివరణ ఇస్తానని ప్రైవేటు విద్యా సంస్థల సంఘం ఛైర్మన్ రమేష్ అన్నారు. ఇవాళ(శనివారం) ఆయన ఏబీఎన్‌తో మాట్లాడారు. తాను సీఎం రేవంత్‌కి ఫ్యాన్ అని, రేవంత్ రెడ్డిని హీరో లాగా చూస్తానని చెప్పారు. గత కేసీఆర్ ప్రభుత్వం అన్యాయం చేస్తే.. రేవంత్ సీఎం అయ్యాక సహాయం చేశారని గుర్తు చేసుకున్నారు. కొంత కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల ఇబ్బందులు వస్తున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమకు సహకరిస్తోందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం చేసిన బకాయిల వల్లనే ఇబ్బందులు ఏర్పడుతున్నాయని రమేష్ ఆరోపించారు. ప్రభుత్వం ఏం చెప్పినా.. ఒక ఒబిడియెంట్ విద్యార్థి లాగా వింటున్నానని తెలిపారు. విద్య వ్యాపారం కాదు సేవ అని స్పష్టం చేశారు. 97.23 శాతం ప్రైవేట్ విద్యాసంస్థలు ఉన్నాయని పేర్కొన్నారు. డొనేషన్లు తీసుకోమని ప్రభుత్వమే అధికారం ఇస్తోందని, ప్రభుత్వంలోనే లోపం ఉందన్నారు. వాటిని కలిసి సరిదిద్దుదామని తాము ప్రభుత్వానికి చెప్పామని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంలో ఫ్రాడ్ చేస్తున్నది తహసీల్దార్లని ఛైర్మన్ రమేష్ ఆరోపించారు. తహసీల్దార్లు దొంగ ఇన్‌కమ్ సర్టిఫికెట్లు ఇస్తున్నారని ఆరోపించారు. ఐదేండ్లుగా ప్రభుత్వం డబ్బు ఇవ్వకపోయినా.. విద్యా సంస్థలను నడుపుతున్నామని తెలిపారు. తమ వెనక ఏ రాజకీయ శక్తులు లేవని స్పష్టం చేశారు. ప్రభుత్వం డబ్బు ఇవ్వకుండా.. ట్రస్ట్ బ్యాంక్ లాంటిది ఏర్పాటు చేయాలని కోరారు. ప్రైవేట్ విద్యా సంస్థలన్నీ లక్ష కోట్ల టర్నోవర్ చేస్తున్నాయని విద్యా సంస్థల సంఘం ఛైర్మన్ రమేష్ వెల్లడించారు.

## స్వతంత్ర సంస్థలను కేంద్రం దుర్వినియోగం చేస్తోంది: మీనాక్షి నటరాజన్




హైదరాబాద్: స్వతంత్ర సంస్థలను కేంద్రం దుర్వినియోగం చేస్తోందని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ ఆరోపించారు. మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో జనాభిప్రాయం ప్రకారం ఫలితం రాలేదన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి గాంధీభవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. ఓట్ల చోరీపై ఇటీవల రాహుల్ గాంధీ మీడియాకు వివరాలు వెల్లడించారని, కొన్ని ప్రాంతాల్లో ఒకే చిరునామాతో ఎక్కువ ఓట్లు ఉన్నాయని గుర్తు చేశారు. హరియాణాలో 8 సీట్లలో 400 ఓట్ల వ్యత్యాసంతో కాంగ్రెస్ ఓడిపోయిందని చెప్పారు. ఓట్ల చోరీపై సంతకాల సేకరణ కొనసాగుతోందని తెలిపారు. ఎన్నికల సంఘాన్ని భాజపా ప్రభావితం చేస్తోందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. ఈసీని గుప్పిట్లో ఉంచుకొని ఓట్ల అవకతవకలకు భాజపా పాల్పడుతోందన్నారు. దీనిని రాహుల్ గాంధీ ఇప్పటికే ఆధారాలతో సహా నిరూపించారన్నారు. హరియాణాలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ప్రజలంతా భావించారని, అందుకు వ్యతిరేకంగా భాజపా గెలిచిందని అన్నారు. " హరియాణాలో 25 లక్షల నకిలీ ఓట్లు ఉన్నాయి. ఒకే మహిళ ఫొటోతో వంద ఓట్లు ఉన్నాయి. పక్క రాష్ట్రాల్లోని వ్యక్తులను సైతం ఓటర్లుగా చేర్చారు. బిహార్‌లో తమకు బలం లేని చోట.. ఓట్లను భాజపా తొలగిస్తోంది.

ఈసీని ఆధారాలతో సహా రాహుల్ గాంధీ ప్రశ్నిస్తే.. సమాధానం లేదు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఈసీ.. ఒకే పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తోంది. ఓట్ల అవకతవకలకు వ్యతిరేకంగా సంతకాలు సేకరిస్తున్నాం. ఇప్పటి వరకు దేశంలో 5 కోట్ల సంతకాల సేకరణ జరిగింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనూ పక్క నియోజకవర్గాల ఓటర్లను చేర్చారు" అని విమర్శించారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ అడిగితే వీధి రౌడీలాగా మాట్లాడుతారా.. సీఎం రేవంత్‌పై కవిత ఫైర్




వరంగల్, నవంబరు8 :సీఎం రేవంత్‌రెడ్డిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అడిగినందుకు సీఎం రేవంత్‌రెడ్డి వీధి రౌడీలాగా మాట్లాడారని షాకింగ్ కామెంట్స్ చేశారు. ఇవాళ(శనివారం) వరంగల్‌లో కవిత పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాల్లో కవిత పాల్గొన్నారు. కవితకి కాజీపేట ఫాతిమా నగర్ బ్రిడ్జి దగ్గర బోనాలతో తెలంగాణ జాగృతి కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు.

రేవంత్‌రెడ్డి మాట తప్పినందుకే ప్రైవేట్ కాలేజీల నిర్వాహకులు బంద్‌కి దిగారని గుర్తుచేశారు. ఆయా కాంట్రాక్టర్లకు పైసలు ఇచ్చారని.. కానీ ప్రైవేట్ కాలేజీలకు కాంగ్రెస్ ప్రభుత్వం డబ్బులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. పిల్లల భవిష్యత్తు గురించి రేవంత్‌రెడ్డి సర్కార్ వెంటనే ఆలోచించాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై రేవంత్‌రెడ్డి మా ట్లాడిన మాటలను తాను ఖండిస్తున్నానని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు వరంగల్ నగరంలో ఉండి స్థానిక సమస్యలు తెలుసుకుంటానని చెప్పుకొచ్చారు కవిత.

**వరద బాధితులకి న్యాయం చేయాలి..** అలాగే, వరంగల్ నగరంలోని సమ్మయ్యనగర్ కాలనీలో వరద బాధిత ప్రాంతాల్లో కవిత పర్యటించారు. వరద బాధితులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వారి సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మాటిచ్చారు. వరద బాధితులకి న్యాయం చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని.. కానీ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. సీఎం మాట అంటే గవర్నమెంట్ ఆర్డర్ అని చెప్పుకొచ్చారు కవిత. వరద బాధితులకు ఇప్పటిదాక కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు కనీస తక్షణ సాయం చేయలేదని ప్రశ్నించారు. వరద బాధితులు ఒక్కరికీ నయా పైసా కూడా ఇవ్వకపోవడం దారుణమని మండిపడ్డారు. వరంగల్ జిల్లా కలెక్టర్ వెంటనే బాధితులకు సాయం అందించాలని డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా వరంగల్ నగరాన్ని వరదలు చుట్టుముట్టాయని ఆరోపించారు. ఇది ప్రకృతి విపత్తు కాదని కాంగ్రెస్ తెచ్చిన విపత్తు అని ఎద్దేవా చేశారు కవిత.

**ఎంజీఎం ఆస్పత్రిలో కనీస వసతులు లేవు..** మరోవైపు.. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో కవిత పర్యటించారు. రోగుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఎంజీఎం ఆస్పత్రిని గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ పట్టించుకోలేదని ఫైర్ అయ్యారు. ఎంజీఎంలో రోగులకు కనీస మౌలిక వసతులు కరువయ్యాయని తెలిపారు. ఎంజీఎం ఆస్పత్రిలో సూది ఉంటే దూది లేదని.. దూది ఉంటే సూది లేదని విమర్శించారు. వరంగల్ జిల్లాలో ఇద్దరు మహిళ మంత్రులు ఉన్న ప్రసూతి ఆస్పత్రి దౌర్భాగ్య స్థితిలో ఉందని ఆక్షేపించారు. రాజకీయ ఉద్దేశంతో తాను పర్యటనలు చేయడం లేదని స్పష్టం చేశారు. కేవలం ప్రజా సమస్యల మీద తాను పోరాటం చేస్తున్నానని కవిత పేర్కొన్నారు.







## రెండు వేల నాటు కోళ్లు ప్రత్యక్షం.. ఆ ఊళ్లో పండుగే పండుగ

ఎల్కతుర్తి, నవంబర్ 8: కోడి మాంసం అంటేనే నోరు ఉవ్విల్లూరుతుంది. అందులోను నాటుకోడి అంటే.. లొట్టలేసుకుంటూ తింటాం. గ్రామాల్లో ఎక్కువగా నాటుకోళ్లు పెంచుకుంటూ ఉంటారు. కోళ్లు పెద్దవి అయ్యాక వాటిని అమ్మడం గాని, ఏదైనా పండుగల సమయంలో వాటిని కోసుకొని తినడం గానీ చేస్తారు. ఇంట్లో పెంచుకున్న నాటు కోళ్లను తినేందుకు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తుంటాం. కానీ ఒక గ్రామంలోని ప్రజలు లక్కీ ఛాన్స్ కొట్టేశారు. ఎవరో నాటు కోళ్లను తీసుకొచ్చి గ్రామంలో వదిలేశారు. దీంతో కోళ్ళన్నీ పొలాల చుట్టూ కనిపించాయి. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ ఘటన జరిగింది. సిద్దిపేట-ఎల్కతుర్తి రహదారిపై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నాటుకోళ్లను రోడ్డుపై వదిలి వెళ్లిపోయారు. ఒకటి కాదు రెండు కాదు సుమారు 2 వేల నాటు కోళ్లను వదిలేశారు. ఒక్కసారిగా కోళ్లను చూసిన గ్రామస్తుల ఆనందానికి అవధులు లేవు. ఈ విషయం ఆనోటా ఈ నోటా పాకడంతో గ్రామస్తులంతా చేరి కోళ్లను పట్టుకున్నారు. ఒక్కొక్కరు రెండు, మూడు కోళ్లను పట్టుకొని ఇంటికి తీసుకువెళ్లగా.. కొందరు పదుల సంఖ్యలో తీసుకెళ్లారు. చాకచక్యంగా కోళ్లను పట్టుకొని.. నాటు కోడికూర వండుకొని పండుగ చేసుకున్నారు. ఊరంతా కోళ్లను వండుకుని తినడంతో పండుగ వాతావరణం తలపించింది. ఈ విషయం జిల్లా మొత్తం తెలియడంతో గ్రామస్తులు లక్కీ ఛాన్స్ కొట్టేశారు అని అందరూ అంటున్నారు. అయితే ఆ కోళ్లను అక్కడ ఎవరు వదిలేశారు అనేది ప్రశ్నార్థకంగా మారింది.




## రూ.60,799 కోట్లతో కొత్త రోడ్లు.. సర్కార్ గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, నవంబర్ 8: రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల నిర్మాణానికి సర్కార్ శ్రీకారం చుట్టింది. దాదాపు రూ. 60,799 కోట్లతో రోడ్లను నిర్మించాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు నిధుల మంజూరు సర్కార్ ఆమోద ముద్ర వేసింది. రహదారుల నిర్మాణానికి నిధుల మంజూరు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ చరిత్రలో ఎన్నడూ లేని రికార్డుగా అభివర్ణించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధితో తెలంగాణ బహుళజాతి సంస్థల కేంద్రంగా మారబోతోందని తెలిపారు. హైదరాబాద్ - విజయవాడ హైవే విస్తరణకు రూ. 10,400 కోట్లు కేటాయించడం జరిగిందని... దీనిని ఎనిమిది లైన్లుగా మార్పు చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణానికి రూ. 36,000 కోట్లు మంజూరు అయ్యిందని.. ఇది రాష్ట్రానికి గేమ్‌చేంజర్ ప్రాజెక్ట్ అని వెల్లడించారు. రహదారులు లేని గ్రామాల్లో కొత్త రోడ్లు, సింగిల్ రోడ్ల స్థానంలో డబుల్ రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు.

హెచ్ఏఎమ్ ప్రాజెక్ట్ కోసం రూ. 11,399 కోట్లు కేటాయించడం జరిగిందని.. ఇందు కోసం త్వరలోనే టెండర్లను పిలువనున్నట్లు చెప్పారు. మన్ననూరు - శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ 52 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి రూ. 8,000 కోట్లు కేటాయించడం జరిగిందని... అలాగే ఫ్యూచర్ సిటీ - అమరావతి - బందరు పోర్ట్ గ్రీన్ ఫీల్డ్ హైవేకు రూ. 20,000 కోట్లు కేటాయించినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక ఆదేశాలు



హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోలింగ్ దృష్ట్యా హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక ఆదేశాలు జారీ చేశారు. నియోజకవర్గం పరిధిలో 9వ తేదీ (ఆదివారం) సాయంత్రం 6 గంటల నుంచి పోలింగ్ జరగనున్న 11వ తేదీ (మంగళవారం) సాయంత్రం 6 గంటల వరకు, తిరిగి ఓట్ల లెక్కింపు జరిగే 14న ఉదయం 6 గంటల నుంచి 15 సాయంత్రం 6 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. నిర్దేశించిన సమయాల్లో మద్యం దుకాణాలన్నీ మూసివేయాలని, హోటళ్లు, రెస్టారంట్‌లు, క్లబ్బులు మూసివేయాలని ఆదేశించారు. శాంతిభద్రతల నేపథ్యంలో నియోజకవర్గం వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఐదుగురు, అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటం నిషేధమన్నారు. ఓట్ల లెక్కింపు రోజున రహదారులు, జనావాసాల్లో టపాసులు పేల్చడం నిషేధమని, ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని సీపీ హెచ్చరించారు.

## డివైడర్‌ను ఢీ కొట్టి పల్టీ కొట్టిన ఇన్నోవా.. పూర్తిగా దగ్ధం

నల్గొండ, నవంబర్ 8: తెలంగాణలోని నల్గొండ జిల్లాలో శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చిట్యాల మండలం గుండ్రాంపల్లి వద్ద హైదరాబాద్-విజయవాడ 65వ జాతీయ రహదారిపై ఇన్నోవా కారు యూటర్న్ వద్ద డివైడర్ ను ఢీ కొట్టి పల్టీ కొట్టింది. ఆ క్షణమే ఇంజన్ మంటలు చెలరేగడంతో కారు పూర్తిగా దగ్ధం అయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, వెంటనే మంటలను ఆర్పివేశారు. అయితే ఈ ప్రమాదంలో ఎనిమిది మంది ప్రయాణికులు కారులో నుంచి సురక్షితంగా బయటపడ్డారు. రోడ్డుకు కారు అడ్డంగా పడిపోవడంతో హైవేపై ట్రాఫిక్ జామ్ అయింది.




## మద్యం సేవించి ట్రాక్టర్ కింద పడుకున్నాడు.. తెల్లారేసరికి ఘోరం

హైదరాబాద్, నవంబర్ 8: మద్యం మత్తులో మందు బాబులు చిత్రవిచిత్రంగా ప్రవర్తిస్తుంటారు. అతిగా మద్యం సేవించి నానా హంగామా చేస్తుంటారు. ఒక్కోసారి వారు ప్రవర్తించే తీరు ప్రాణాల మీదకు కూడా తీసుకొస్తుంటుంది. మందు నిషాలో ఇతరులపై దాడులకు పాల్పడటమే కాకుండా ప్రాణాలు కూడా తీస్తుంటారు. అంతే కాకుండా అధికంగా మద్యం సేవించి ప్రమాదం బారిన కూడా పడుతుంటారు. తాజాగా ఇలాంటి ఘటనే హైదరాబాద్‌లో చోటు చేసుకుంది. ఓ వ్యక్తి బంధువుల ఇంట్లో పెళ్లి కోసం వచ్చి ఫుల్‌గా మందేశాడు. ఆ తరువాత అతను చేసిన పని కుటుంబంలో విషాదాన్ని నింపింది. ఏం జరిగిందో చూద్దాం. నగరంలోని రామాంతపూర్‌లో విషాదం చోటు చేసుకుంది. నిద్రిస్తున్న వ్యక్తిపై నుంచి ట్రాక్టర్ వెళ్లడంతో అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. శేఖర్ అనే వ్యక్తి బంధువుల ఇంట్లో పెళ్లికి వచ్చాడు. పెళ్లి అనంతరం బార్‌లోకి వెళ్లి మద్యం సేవించాడు. ఆ తరువాత మద్యం మత్తులోనే అక్కడే ఉన్న ఓ ట్రాక్టర్ కింద పడుకున్నాడు. ఈరోజు (శనివారం) తెల్లవారుజామున ట్రాక్టర్ నడిపే వ్యక్తి పనికి వెళ్లేందుకు ట్రాక్టర్‌ను తీశాడు.

అయితే ట్రాక్టర్ కింద శేఖర్ ఉన్న విషయాన్ని అతడు గుర్తించలేదు. దీంతో ట్రాక్టర్ చక్రాల కింద శేఖర్ నలిగిపోయాడు. వ్యక్తి అరుపు వినడంతో కిందకు దిగి చూసిన ట్రాక్టర్ యజమానికి శేఖర్ టైర్స్ కింద పడి ఉండటాన్ని గుర్తించాడు. అయితే అప్పటికే జరగాల్సి ఘోరం జరిగిపోయింది. తీవ్రంగా గాయపడిన శేఖర్ స్పాట్‌లోనే ప్రాణాలు విడిచాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా బంధువుల ఇంట పెళ్లికి వచ్చిన వ్యక్తి ట్రాక్టర్ కింద పడి మృతిచెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com